హైదరాబాద్
బుధవారం-18
నవంబర్-2026

పేజీలు-8


balagamtv100@gmail.com

బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/

తీరం వైపు దూసుకొస్తున్న 'అక్వాన్'..



వివరాలు 4లో..

కోటి కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు
- ఈ నెల 19న సిద్ధిపేట సభలో దరఖాస్తు ప్రారంభం
- అర్హులైన మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు
- చీరల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, నవంబర్ 17 :
రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించేలా ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ నెల 19న సిద్ధిపేటలో నిర్వహించే బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా దరఖాస్తును సీఎం ప్రారంభించను న్నారు. ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీపై మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఈ పథకం వర్తించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న బీమా పథకాల ద్వారా జీవిత బీమా కింద రూ.2 లక్షలు, ప్రమాద బీమా కింద రూ.10 లక్షల వరకు ప్రయోజనాలు అందుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో అన్ని బీమా పథకాలను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రస్తుతం అందుతున్న ప్రమాద బీమా ప్రయోజనాలను యథాతథంగా కొనసాగించాలని, రూ.2 లక్షల జీవిత బీమాను రూ.5 లక్షలకు పెంచాలని ఆదేశించారు. ఇప్పటికే ప్రభుత్వ బీమా భద్రత పొందుతున్న వారిలో ఏ ఒక్కరూ లబ్ధి నుంచి తప్పిపోకూ డదని స్పష్టం చేశారు. ఈ నెల 19న సిద్ధిపేట బహిరంగ సభలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అర్హులైన మహిళలందరికీ చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని

మిగతా 3లో..

తెలంగాణ ప్రజల పోరాట ఫలితమే రాష్ట్ర ఏర్పాటు..

- సోనియా గొప్పతనం కాదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- రూ.100 కోట్లతో భారత్ సమ్మిట్ నిర్వహించి సాధించిందేమిటి?
- క్రుడువు వేళ ప్రజాధనం దుబారా చేస్తున్న ప్రభుత్వం
- క్రొడంగల్‌కు రూ.9 వేల కోట్లు.. ఇతర ప్రాంతాల అభివృద్ధిపై నిర్లక్ష్యమెందుకు?
- మ్రూసీ సుందరీకరణకు 10 టీఎంసీల నీరెక్కడి నుంచి?



హైదరాబాద్, నవంబర్ 17 :
తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సోనియా గాంధీ గొప్పతనం కాదని, తెలంగాణ ప్రజల అలుపెరుగని పోరాటం, ఉద్యమ తీవ్రత కారణంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గుర్తించి రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం వెనుక ప్రజా ఉద్యమమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. రూ.100 కోట్ల ప్రజాధనంతో భారత్ సమ్మిట్ నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి ఏం సాధించిందో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సదస్సు ద్వారా ఎన్ని పెట్టుబడులు వచ్చాయి? ఎంతమందికి ఉద్యోగాలు లభించాయి? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. భారీ ఖర్చుతో కార్యక్రమాలు నిర్వహించడం కంటే వాటి ద్వారా రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలను వివరించాలని అన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొని రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సమయంలో ప్రజల అవసరాలను పక్కనపెట్టి ప్రభుత్వ నిధులను భారీ ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయడం సరికాదని విమర్శించారు. ప్రజాధనాన్ని ప్రాధాన్యతలకు అనుగుణంగా వినియోగించాలని సూచించారు. కొడంగల్ నియోజకవర్గానికి సుమారు రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులు కేటాయించడంపై కేటీఆర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, నియోజకవర్గాల్లోనూ అభివృద్ధి

మిగతా 3లో..

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం!



- ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం..
- మంత్రి వాకిటి శ్రీహరి
- రూ.203.36 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సదుపాయాలు..
- రాబోయే 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి

వివరాలు 2లో..


పోలీసు అధికారుల పదోన్నతులకు మార్గం సుగమం



- రాజీమార్గమే రాజమార్గం.. డీజీపీ చొరవతో వివాదాలకు తెర
- తొలి విడతలో 54 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా ప్రమోషన్లు
- 2027 ఆగస్టు నాటికి మరో 34 అదనపు ఎస్పీ పోస్టులు
- 12 మంది అడిషనల్ ఎస్పీలకు నాన్ క్యాడర్ ఎస్పీలుగా పదోన్నతులు
- ప్యానల్ ఇయర్‌లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులు
- 1991, 1995, 1996 బ్యాచ్‌ల ప్రమోషన్ ప్యానళ్లు సిద్ధం
- అధికారుల ఏకాభిప్రాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్న డీజీపీ సీవీ ఆనంద్

మిగతా 2లో..

యాదాద్రి ప్లాంట్‌తో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సన్నాహాలు



- యాదాద్రి వెలుగులతో తెలంగాణ విద్యుత్ రంగానికి మరింత బలం
- డిసెంబర్‌లో ఐదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి సన్నాహాలు
- రబీ సీజన్‌లో ఐదు యూనిట్లతో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- నిరంతర బొగ్గు సరఫరాకు TGGENCO ప్రత్యేక చర్యలు

వివరాలు 3లో..

గిరిజన ఆత్మగౌరవంపై కాంగ్రెస్ కత్తి..!



- బిఆర్ఎస్ సర్పంచ్ పై కాంగ్రెస్ గుండాల దాడి అమానుషం..!
- పాలకుర్తిలో భగ్గుమన్న బీఆర్ఎస్ నిరసన జ్వాల..
- గిరిజన ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ అక్కసు..
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఉసిగొల్పడం వల్లే సర్పంచ్‌పై దాడి జరిగిందని బీఆర్ఎస్ నేతల ఆరోపణ
- రాజీవ్ చౌరస్తాలో మహా ధర్నా.. ప్రభుత్వానికి, స్థానిక కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాల హోరు
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు..
- ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట, పట్టణంలో ఉద్రిక్తత
- రణరంగంగా మారిన పాలకుర్తి
- బాధిత సర్పంచ్ బానోత్ మహేందర్ నాయక్, పసునూరి నవీన్, ధరావత్ గాంధీ నాయక్‌ల అరెస్ట్
- దాడిపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతిపత్రం

వివరాలు 4లో..

ఆయిల్ పామ్ రైతులకు ఆదాయ భాగస్వామ్యం 80:20 నిష్పత్తిలో అమలు చేయాలి

- గెలల ధర టన్నుకు రూ.25 వేల కనీస గ్యారంటీ ధర నిర్ణయించాలి
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి విజ్ఞప్తి చేసిన రైతులు
- రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి..
- కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హామీ
- కేంద్రానికి లేఖ రాయాలని అధికారులకు ఆదేశం



వివరాలు 3లో..

ఏరోస్పేస్ పెట్టుబడుల ఆకర్షణకు ప్రత్యేక కార్యాచరణ

- స్థానికంగానే విమాన విడిభాగాల తయారీ, నిర్వహణకు అవసరమైన టూలింగ్ సదుపాయాలు
- అధునాతన తయారీ, డిజైన్, ఇంజినీరింగ్ రంగాలకు ప్రోత్సాహం
- జేఈహెచ్ ఏరోస్పేస్ 'టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు
- ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు కేంద్రంగా హైదరాబాద్



హైదరాబాద్, నవంబర్ 17 :
ప్రెసిషన్ ఇంజినీరింగ్, అధునాతన తయారీ రంగాలకు హైదరాబాద్‌ను కీలక కేంద్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. విమాన విడిభాగాల తయారీతో పాటు వాటికి అవసరమైన టూలింగ్, అధునాతన యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రంలోనే

మిగతా 3లో..

ఉద్యమ జర్నలిస్టులకు న్యాయం చేస్తాం

- ప్రొఫెసర్ కోదండరాం
- ఉద్యమకారుల గుర్తింపుపై అవగాహన సదస్సు
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోదండరాం సూచన
- జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు కల్పించాలని డిమాండ్



వివరాలు 2లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం



- మేకలమండి పాఠశాలకు హైస్కూల్‌గా గుర్తింపు
- రూ.3 కోట్లతో పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం

హైదరాబాద్, నవంబర్ 17 :

పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్య అందించి, వారిని ఉన్నత స్థాయికి చేర్చడమే తన లక్ష్యమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.బన్సీలాల్‌పేట డివిజన్ భోలక్ పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు హైస్కూల్‌గా గుర్తింపు లభించడంతో మంగళవారం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.తలసాని మంత్రి హోదాలో ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పాఠశాలకు విశాలమైన స్థలంలో భవనాలు నిర్మించడంతో పాటు, ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి ప్రాథమికోన్నత పాఠశాలగా, ప్రస్తుతం ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయినట్లు కమిటీ సభ్యులు వివరించారు. హైస్కూల్‌గా గుర్తింపు ఇస్తూ విద్యాశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రతిని ఎమ్మెల్యేకు అందజేశారు.ప్రస్తుతం పాఠశాలలో ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు 630 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, ఇకపై 8, 9, 10 తరగతులు కూడా ప్రారంభం కానున్నాయని తలసాని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలే చదువుతున్నారని, వేలాది రూపాయల ఫీజులు చెల్లించి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించే ఆర్థిక స్థోమత అందరికీ ఉండదన్నారు.విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించాలనే ఉద్దేశంతో రూ.3 కోట్ల వ్యయంతో పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు నిర్మించినట్లు తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మేకలమండి పాఠశాల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులోనూ తన పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఈ. చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బి. నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు ఆర్. రాజు, భరత్ భూషణ్, మాజీ ప్రధానోపాధ్యా యుడు మల్లికార్జున్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యమ జర్నలిస్టులకు న్యాయం చేస్తాం



- ప్రొఫెసర్ కోదండరాం
- ఉద్యమకారుల గుర్తింపుపై అవగాహన సదస్సు
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోదండరాం సూచన
- జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు కల్పించాలని డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 17 :

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులకు తగిన గుర్తింపు, న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎమ్మెల్సీ, కేకే కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ కోదండరాం హామీ ఇచ్చారు. మంగళవారం గడ్డిఅన్నారంలోని శ్రీ సాయి ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజేఎ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర నాయకుడు జ్వాల కిషన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోదండరాం మాట్లాడుతూ తెలంగాణ ప్రజల భాగస్వామ్యం, త్యాగాలు, పోరాటాల ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారందరినీ గుర్తించడం కొంత క్లిష్టమైనప్పటికీ, సమగ్రంగా జాబితా రూపొందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.ఉద్యమకారులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో పొందుపరచాల్సిన అంశాలపై ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. పోలీసు కేసులు, జైలు శిక్షకు సంబంధించిన రికార్డులు, ఉద్యమ సమయంలో జరిగిన సంఘటనలు, ఇతర ఆధారాల ద్వారా ఉద్యమకారులను గుర్తించే అవకాశం ఉందన్నారు. జర్నలిస్టులు అందించే సూచనలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు.టీయూడబ్ల్యూజేఎ రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి జర్నలిస్టుకు గౌరవం, గుర్తింపు కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం, నెలకు రూ.10 వేల జీవనభృతి కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 540 మంది జర్నలిస్టులు మృతి చెందినట్లు తెలిపారు.ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఎల్‌బీనగర్ ప్రాంతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న జర్నలిస్టులందరికీ గుర్తింపు కల్పించాలని కోదండరాంను కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని సూచించారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైందని, వారికి తగిన గుర్తింపు, ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ ఎల్‌బీనగర్‌లో తొలి జేఏసీ ఏర్పాటు చేసి, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు.కేకే కమిటీ సభ్యుడు మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు తగిన గుర్తింపు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజేఎ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సలీం పాషా, మేకల సత్యనారాయణ, రాజేష్, రాములు, ప్రవీణ్, ఆనంతుల శ్రీనివాస్, పిండి వెంకన్న,పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన గోషామహల్ నాయకులు



హైదరాబాద్, నవంబర్ 17 :


బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో గోషామహల్ నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వి. మహేందర్ కుమార్, బీసీ విభాగం వెస్ట్ ప్రెసిడెంట్ తెలంగాణ శేఖర్ చారి తదితరులు కేటీఆర్‌ను కలిసి మాట్లాడారు.

మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్

గుండు వాణి అక్రమాస్తుల గుట్టురట్టు

- కూతురి రియల్ ఎస్టేట్ సంస్థలోకి లంచాల మళ్లింపు
- వైన్స్, షేర్లలో రూ. 1.80 కోట్ల పెట్టుబడులు
- రూ. 5.47 లక్షల నగదు, బంగారం, కార్లు సీజ్
- ఏసీబీ సోదాల్లో బయటపడ్డ రూ.30 కోట్ల అక్రమాస్తులు





హైదరాబాద్, బలగం టీవీ (నవంబర్ 17):

పదేళ్ల సర్వీసులో వచ్చిన అధికారిక జీతం కేవలం రూ. 70 లక్షలు మాత్రమే. కానీ ఆమె వెనకేసిన అక్రమాస్తుల బహిరంగ మార్కెట్ విలువ మాత్రం ఏకంగా రూ. 30 కోట్లు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ టౌన్ ప్లానింగ్ అధికారిణి (టీపీఓ) గుండు వాణి అవినీతి బాగోతాన్ని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వెలుగులోకి తెచ్చింది.జీం3 భవన నిర్మాణ అనుమతుల మంజూరు కోసం మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ ఖమర్ నుంచి రూ. 75 వేలు లంచం తీసుకుంటూ సెప్టెంబర్ 30న మాజీ పం చాయతీ కార్యదర్శి ఎలమోని సుదర్శన్‌తో కలిసి ఆమె ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ప్రస్తుతం చంచల్‌గూడ మహిళా జైలు రిమాండ్‌లో ఉన్న ఆమెపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసిన అధికారులు, నిర్వహించిన సోదాల్లో కళ్లు చెదిరే ఆస్తులను గుర్తించారు. హైదరా బాద్ ఆసిఫ్ నగర్‌కు చెందిన గుండు వాణి 2016లో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సీర్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. అనం తరం సూపర్‌వైజర్, టీపీఓగా పదోన్నతులు పొందారు. వికారాబాద్ మున్సిపాలిటీతో పాటు మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మున్సి పాలిటీల అదనపు బాధ్యతలు నిర్వహించిన సమయంలో భవనాల విస్తీర్ణం, ఫ్లోర్ల సంఖ్యను బట్టి భారీగా లంచాలు డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. పదేళ్లలో ఆమె సంపాదించిన అధికారిక వేతనం రూ.70 లక్షలు కాగా, ప్రభుత్వ లెక్కల ప్రకారమే రూ. 6.76 కోట్ల విలువైన స్థిర, చరాస్తులను కూడబెట్టారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ రూ.30 కోట్ల వరకు ఉంటుందని ఏసీబీ అధికారులు తేల్చారు.లంచాల రూపంలో వచ్చిన అక్రమ సొమ్మును కూతురి పేరిట నెలకొల్పిన రియల్ ఎస్టేట్ సంస్థ ద్వారా ఆమె భర్త వ్యాపారంలోకి మళ్లించినట్లు దర్యాప్తులో వెల్ల డైంది. అత్తాపూర్, జడ్చర్ల, జనగామ సహా ఎనిమిది ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వ హించింది. అత్తాపూర్‌లో రూ. 63 లక్షల ఫ్లాట్, రూ. 2.45 కోట్ల విలువైన జీం2 భవనం, మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండలో 1.10 ఎకరాల వ్యవసాయ భూమి, జడ్చర్ల, పాలకుర్తిలలో ఓపెన్ ప్లాట్లను గుర్తించారు.వీటితో పాటు మహబూబ్‌నగర్‌లోని తుల్జా భవానీ వైన్స్‌లో రూ. 50 లక్షలు, షేర్ మార్కెట్‌లో రూ.1.30 కోట్ల పెట్టుబడులు ఉన్నట్లు తేలింది. రూ. 5.47 లక్షల నగదు, బ్యాంకుల్లో రూ. 7.97 లక్షల డిపాజిట్లు, 175 గ్రాముల బంగారం, మహీంద్రా ఎక్స్‌యూవీ 700, హ్యుందాయ్ క్రెటా కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను అధికారులు సీజ్ చేశారు.

హలో జర్నలిస్ట్-ఛలో ఇందిరా పార్క్

- ఇళ్ళస్థలాల సాధనకై 20న గ్రేటర్ జర్నలిస్టుల మహా ధర్నా

హైదరాబాద్, బలగం టీవీ (నవంబర్ 17):

గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కేటాయింపులో కొనసాగుతున్న ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 20వ తేదీన ఇందిరా పార్కు ధర్నా చౌక్ లో జర్నలిస్టుల మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ ధర్నాలో వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలియజేస్తారని వారు పేర్కొన్నారు. ఇళ్ళస్థలాల కోసం ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తూ నిరాశ – నిస్పృహలకు లోనైన గ్రేటర్ జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు, గృహ వసతి కల్పించే ఉద్దేశ్యంతో 2008 లో "గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ"(=వస్త్రం చీశీ. 163/2008) ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 1300 మంది సొసైటీ సభ్యులైన జర్నలిస్టులు గత 18 ఏళ్ళుగా ఇళ్ళ స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. హైదరా బాద్ జిల్లాతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సి పాలిటీలలో నివసిస్తూ వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ళస్థలాలు కేటాయిం చకుండా ఉత్తుత్తి హామీలతో కాలయాపన చేస్తుందని ధ్వజ మెత్తారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా జర్నలి స్టులకు కనీస సదుపాయాలు లభించడంలేదని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో జర్నలిస్టుల సం క్షేమానికి సంబంధించిన ఐదు అంశాలను మేనిఫెస్టో లో పెట్టి అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారం లోకి వచ్చి మూడేళ్ళు కావస్తున్నా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జర్న లిస్టుల ఇళ్ళస్థలాల విషయంలో ముఖ్యమంత్రి, మంత్రుల చిట్ చాట్ మాటలు, ఉత్తుత్తి హామీలే తప్ప ఆచరణలో ఏమీ చేయడంలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాత్రికే యులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళస్థలాల సమస్య పై ఈనెల 20న జరిగే జర్నలిస్టుల మహాధర్నాతోనైనా ప్రభుత్వం వెంటనే మేల్కొని గ్రేటర్ జర్నలిస్టులకు ప్రత్యేక జీవో ద్వారా ఇళ్ళస్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

ఆయిల్ పామ్ రైతులకు ఆదాయ భాగస్వామ్యం 80:20 నిష్పత్తిలో అమలు చేయాలి

- రైతుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి..
- కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని హామీ
- కేంద్రానికి లేఖ రాయాలని అధికారులకు ఆదేశం

హైదరాబాద్, నవంబర్ 17 :

పెరుగుతున్న సాగు పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులు--కంపెనీల మధ్య ఆదాయ పంపిణీ నిష్పత్తిని ప్రస్తుతమున్న 75:25 నుంచి 80:20కి మార్చాలని ఆయిల్ పామ్ రైతులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస గ్యారంటీ ధర నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసిన రైతులు తమ సమస్యలు, డిమాండ్లను వివరించారు. 2025-26 ఆయిల్ ఇయర్ ముగియడంతో 2026-27 ఆయిల్ ఇయర్‌కు సంబంధించి గెలల ధర నిర్ణయించేందుకు కొత్త ఫార్ము లాను రూపొందించాల్సిన నేపథ్యంలో తమ ప్రతిపాదనలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గత కొంతకాలంగా ఎరువుల ధరలు, కూలీల వేతనాలు, సాగుకు అవసరమైన ఇతర పెట్టుబడి ఖర్చులు గణనీయంగా పెరిగాయని రైతులు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు పెరుగుతున్న ఖర్చులు ఆయిల్ పామ్ సాగును భారంగా మారుస్తున్నాయని వివరించారు. రైతులకు తగిన ఆదాయం లభించేలా ధరల నిర్ణయ విధానంలో మార్పులు తీసుకురావాలని కోరారు.ప్రస్తుతం అమల్లో ఉన్న సీఏసీపీ ఫార్ములాను కేంద్ర ప్రభుత్వం 2013లో రూపొందించిందని, అప్పటి నుంచి సాగు ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ఆదాయ భాగస్వామ్య నిష్పత్తిని 80:20కి సవరించాలని రైతులు సూచించారు. 20.01 శాతం ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో వద్ద 80:20 నిష్పత్తిని అమలు చేస్తే క్రూడ్ పామ్ ఆయిల్ మల్టిప్లయర్ 15.05 శాతం నుంచి 16.01 శాతానికి, పామ్ కెర్నల్ నట్ మల్టిప్లయర్ 7.59 శాతం నుంచి 8.06 శాతానికి పెరుగుతుందని వివరించారు. ఈ మార్పుతో ప్రతి టన్ను ఆయిల్ పామ్ గెలలపై రైతులకు సుమారు రూ.1,516 అదనపు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. రైతుల విజ్ఞప్తులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఆదాయ పంపిణీ నిష్పత్తిని 80:20కి మార్చే అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు వెంటనే కేంద్ర వ్యవసాయశాఖ కార్యదర్శికి లేఖ రాయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శిని ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయ పడ్డారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రైతులు నష్టపోకుండా ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును మరింత ప్రోత్సహించడంతో పాటు రైతులకు న్యాయమైన ధర, స్థిరమైన ఆదాయం కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

సూక్ష్మ పరిశ్రమలతోనే వికసిత్ భారత్ సాకారం





- రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్
- గ్రామీణ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ద్వారా సమ్మిళిత అభివృద్ధి సాధ్యం
- జేఆర్‌డీ టాటా అవార్డ్స్-2026 ప్లీనరీ సమావేశంలో పాల్గొన్న విజయ్

న్యూఢిల్లీ, నవంబర్ 17 :

సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధి, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాకారం చేయవచ్చని రాజ్యసభ సభ్యుడు చింతకాయల విజయ్ అన్నారు. భారతీయ యువ శక్తి సామాజిక ట్రస్ట్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని షాంగ్రి-లా ఈరోస్ వేదికగా నిర్వహించిన 'జేఆర్‌డీ టాటా అవార్డ్స్--2026' ప్రత్యేక ప్లీనరీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 'సూక్ష్మ పరిశ్రమలు: వికసిత్ భారత్‌కు మార్గం' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సమావే శంలో కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఎస్. మహేంద్ర దేవ్, ఎన్డీటీవీ సీఈఓ, ఎడిటర్-ఇన్-చీఫ్ రాహుల్ కన్వల్‌తో కలిసి చింతకాయల విజయ్ వేదికను పంచుకున్నారు. సూక్ష్మ పరిశ్రమల బలోపేతం, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అవకాశాల కల్పనపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ప్రొఫెసర్ మహేంద్ర దేవ్, రాహుల్ కన్వల్ వంటి ప్రముఖులతో కలిసి ఈ ప్లీనరీలో పాల్గొన డం, సూక్ష్మ పరిశ్రమల అభివృద్ధిపై అర్థవంతమైన చర్చలో భాగస్వామి కావడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. భారతదేశ గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించిన డీఓ వ్యవస్థాపక, మేనేజింగ్ ట్రస్టీ లక్ష్మీ వెంకటేశన్‌తో పాటు ఆమె బృందాన్ని అభినందించారు.మరింత శక్తివంతమైన, సమ్మిళిత భారతదేశ నిర్మాణానికి సూక్ష్మ పరిశ్రమలు, గ్రామీణ పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమని పేర్కొంటూ, వారి పారిశ్రామిక స్ఫూర్తికి మద్దతుగా నిలవడం గర్వంగా ఉందని చింతకాయల విజయ్ తెలిపారు.

పోలీసు అధికారుల పదోన్నతులకు మార్గం సుగమం

- అధికారుల ఏకాభిప్రాయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్న డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్, నవంబర్ 17 :

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పోలీసు అధికారుల పదోన్నతుల సమస్య పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలకు సంబంధించి నెలకొన్న వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన ప్రయత్నాలతో అధికారుల మధ్య ఏకాభిప్రాయం కుదరడంతో పదోన్నతుల ప్రక్రియకు మార్గం సుగమమైంది.ఈ మేరకు మంగళవారం డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌లకు చెందిన సివిల్ ఎస్పైలతో డీజీపీ సమావేశమయ్యారు. వరంగల్, హైదరాబాద్ రేంజ్‌లతో పాటు హైదరాబాద్ నగరానికి చెందిన అధికారులు పాల్గొన్నారు. పదోన్నతులకు సంబంధించి సీనియారిటీ, రోస్టర్ పాయింట్లు, ఖాళీలు, అర్హతలపై విస్తృతంగా చర్చించారు.డీఎస్పీ స్థాయి అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు తొలి విడతలో 54 పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. రెండో విడతలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు 1991, 1995, 1996 బ్యాచ్‌లకు సంబంధించి పదోన్నతి ప్యానళ్లను సిద్ధం చేశారు.గతంలో ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 74 ప్రకారం పదోన్న తుల ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా, సీనియారిటీ అంశంపై కొందరు అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో వివాదాలు తలెత్తా యి. ఈ నేపథ్యంలో కమిటీ నివేదిక, ప్రభుత్వ ఉత్తర్వులు, సంబంధిత నిబంధనలను సమావేశంలో సమీక్షించారు. ప్రస్తుతం ఎలాంటి న్యాయపరమైన వివాదాలు, కోర్టు కేసులు లేని 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోను న్నారు. వీటితో పాటు ప్యానల్ ఇయర్‌లో మరో 10 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులు కేటాయించనున్నట్లు అధికారులు వివరించారు. అందుబా టులో ఉన్న ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, అర్హులైన అధికారుల వివరాలను డీజీపీ కార్యాలయ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సర్వీసు కాలం, సీనియారిటీ, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని తొలి, రెండో విడత పదోన్నతి జాబితాలను రూపొందించారు. ప్రతిపాదిత జాబితాలపై తమ అభిప్రాయాలను వెల్లడించిన అధికారులు, వాటి ప్రకారం ముందుకు వెళ్లేందుకు అంగీకారం తెలిపారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పదోన్నతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషి చేస్తానని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సీనియారిటీ వివాదాలు, కోర్టు కేసులు దీర్ఘకాలం కొనసాగితే చివరకు అందరికీ నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా పదవీ విరమణకు చేరువలో ఉన్న అధికారులు పదోన్నతి అవకా శాలను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.అర్హులైన ప్రతి అధికారికి న్యాయం జరగాలన్నదే పోలీసు శాఖ లక్ష్యమని, అదే సమయంలో ఎవరికీ అన్యాయం జరగకుండా నిబంధనల ప్రకారమే పదోన్నతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. సుదీర్ఘకాలం పోలీసు శాఖకు సేవలందించిన అధికారులు పదవీ విరమణకు ముందే పదోన్నతి పొందితే వారికి తగిన గుర్తింపు, సంతృప్తి లభిస్తుందని అభిప్రాయ పడ్డారు.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ ప్రజల పోరాట ఫలితమే రాష్ట్ర ఏర్పాటు..

అవసరాలు ఉన్నాయని గుర్తు చేశారు. అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశా రు. మేడిగడ్డ బ్యారేజీలో అందుబాటులో ఉన్న నీటిని ఒడిసిపట్టి రైతుల అవసరాలకు వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. సాగునీటి కోసం రైతులు ఎదురుచూస్తున్న సమయంలో అందుబాటులో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమని వ్యాఖ్యానించారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సుమారు 10 టీఎంసీల నీరు అవసరమవుతుందని పేర్కొన్న కేటీఆర్.. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్న వేళ ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇవ్వడంపై ప్రశ్నలు లేవనెత్తారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత కావాలని అన్నారు. రైతులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న సమయంలో భారీ వ్యయంతో మూసీ సుందరీకరణ చేపట్టాలనుకోవడం ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రశ్నించేలా ఉందని కేటీఆర్ విమర్శించారు. ప్రజాధనం ఖర్చు చేసే ప్రతి కార్యక్రమం రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, వ్యవసాయం, సాగునీరు, ప్రాంతీయ అభివృద్ధికి పెద్దపీట వేయాలని ప్రభుత్వానికి సూచించారు.

కోటి కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా

సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇందిరమ్మ బీమా పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని, జిల్లా కలెక్టర్లు పూర్తి స్థాయిలో ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.ఈ సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, కార్యదర్శి మానిక్ రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏరోస్పేస్ పెట్టుబడుల ఆకర్షణకుప్రత్యేక కార్యాచరణ

అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కొత్తూరులో జేఈహెచ్ ఏరోస్పేస్ సంస్థ ఏర్పాటు చేసిన 'టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. విమానాలు, విమాన ఇంజిన్ల అసెంబ్లీ, మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన ప్రత్యేక టూల్స్, ఫిక్చర్లు, గేజ్‌ల తయారీ లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్--2047 విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని అధునాతన తయారీ, ఏరోస్పేస్, రక్షణ, సాంకేతిక రంగాల్లో ప్రపంచస్థాయి పెట్టుబడులకు, పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళు న్నామని చెప్పారు.ఏరోస్పేస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విడిభాగాల తయారీతో పాటు డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మ్యానుఫ్యాక్చరింగ్, టెస్టింగ్ విభాగాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచస్థాయి సంస్థలు, దేశీయ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) అనుసంధానించడంపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.విమానాలకు అవసరమైన ప్రత్యేక పరికరాలు, ఫిక్చర్లు, గేజ్‌ల కోసం ఇప్పటివరకు కొన్ని ప్రత్యేక సరఫరాదారులపైనే లేదా విదేశాలపైనే కంపెనీలు ఆధారపడాల్సి వచ్చేదని మంత్రి వివరించారు. ఇలాంటి అధునాతన టూలింగ్ సామర్థ్యాలు హైదరాబాద్‌లో అందుబాటులోకి రావడం రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఏరోస్పేస్ రంగం అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్‌కు మరింత గుర్తింపు తీసుకురావడంలో ఇలాంటి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీరపల్లి శంకర్, జేఈహెచ్ ఏరోస్పేస్ సీఈఓ విశాల్ సంఘావి, సీవీఓ వెంకటేష్ ముద్రగళ్ల తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు నిరసన సెగ..

నిలదీసిన కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు



హైదరాబాద్, నవంబర్ 17 :

పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు, సర్పంచుల నుంచే నిరసన సెగ తగిలింది. మంగళవారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్‌లో పింఛన్‌పత్రాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు రాకముందే ఎంపీ వంశీకృష్ణ లబ్ధిదారులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై వివరించి తిరిగి వెళ్లే సందర్భంలో సర్పంచులు తులా మనోహర్‌రావు, బంగారి రమేశ్, మాజీ సర్పంచ్ మాదాసి సతీశ్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఎంపీని అడ్డుకున్నారు. ఎమ్మెల్యే రాకముందే కార్యక్రమాన్ని ప్రారంభించి, ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. ఎంపీ స్టేజీ దిగి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కాంగ్రెస్ నేతల దౌర్జన్యం..

కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ఇంటిపై దాడికి యత్నం!

హైదరాబాద్, నవంబర్ 17 : కాంగ్రెస్ నాయకు లు, కార్యకర్తలు మంగళవారం జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలోని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఇంటిని ముట్టడించేందుకు యత్నించడం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా డా.కల్వకుంట్ల సంజయ్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యలపై గళమెత్తడం, రైతుల పక్షాన చివరి దశలో ఉన్న పొలాలకు నీరందించేందు కు ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాలువకు, సదర్మాట్ బరాజ్ నుంచి గంగనాల ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేయడంలో ప్రత్యేకంగా కృషి చేయడం, మెగా జాబ్ మేళా నిర్వహించి 750 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పించడం తదితర పనులకు ప్రజల్లో మంచి పేరు వస్తుండటంతో జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేపై కక్షగట్టారు.ఇద్దరు మున్సిపల్ కార్మికులను తన సొంత పనులకు ఉపయోగించుకుంటున్నారని ఎమ్మెల్యేపై ఆరోపణలకు దిగి.. నిరసన పేరుతో ఏకంగా ఎమ్మెల్యే ఇంటి వైపు దూసుకుపోయి దౌర్జన్యానికి దిగా రు. ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తారనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించిన గంటల వ్యవధిలోనే బయటకు వచ్చి రోడ్డెక్కడం, ఎమ్మెల్యే ఇంటి వైపు దూసుకురావడం కలకలంరేపింది.మూకుమ్మడిగా ఎమ్మెల్యే ఇంటి వైపు వస్తున్న కాంగ్రెస్ శ్రేణులను మార్గమధ్యంలో పోలీసులు నియంత్రించారు. కాంగ్రెస్ నాయకుల తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కొత్త బస్‌స్టాండ్ సమీపంలో 63వ జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ప్రశ్నించిన బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు లాఠీ ఎత్తి.. బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న చిల్లర రాజకీయాల జోలికి వెళ్లకుండా సహనం పాటించాలని ఎమ్మెల్యే సూచించడంతో బీఆర్ఎస్ శ్రేణులు శాంతించారు.

యాదాద్రి ప్లాంట్‌తో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సన్నాహాలు







- యాదాద్రి వెలుగులతో తెలంగాణ విద్యుత్ రంగానికి మరింత బలం
- డిసెంబర్‌లో ఐదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి సన్నాహాలు
- రబీ సీజన్‌లో ఐదు యూనిట్లతో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం
- నిరంతర బొగ్గు సరఫరాకు TGGEN-CO ప్రత్యేక చర్యలు

హైదరాబాద్, నవంబర్ 17 :

రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంతో పాటు ఉత్పత్తి సామ ర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొత్తం 4,000 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం కలిగిన ఈ ప్లాంట్‌లో ఇప్పటికే నాలుగు యూనిట్లు వాణిజ్య ఉత్పత్తి చేస్తు న్నాయి. ఐదో యూనిట్ అక్టోబర్ 20న గ్రిడ్‌కు అనుసంధానం కాగా, డిసెంబర్‌లో వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించేందుకు అధికా రులు ఏర్పాట్లు చేస్తున్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు యూనిట్లు ఉన్నాయి. రానున్న రబీ సీజన్‌లో ఐదు యూనిట్ల ద్వారా పూర్తి స్థాయిలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఎ++జుచీజూ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం యంత్రాంగాన్ని సిద్ధం చేయడంతో పాటు బొగ్గు సరఫరా, రవాణా వ్యవస్థలను పటిష్టం చేస్తోంది.గతంలో కోవిడ్ పరిస్థితులు, అటవీ అనుమతులు, రైల్వే భూముల సమస్యలు, సాంకేతిక కారణాలతో ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగింది. ప్రస్తుతం నాలుగు యూనిట్లు వాణిజ్య ఉత్పత్తి చేస్తుండగా, ఐదో యూనిట్ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తవుతు న్నాయి. విద్యుత్ ఉత్పత్తి నిరంతరాయంగా కొనసాగాలంటే బొగ్గు సరఫరా కీలకం కావడంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నైనీ బొగ్గు గనితో పాటు వీజూ, జుజూ సంస్థల నుంచి బొగ్గు సరఫరాకు ఏర్పాట్లు చేసింది. ఇప్పటివరకు నైనీ గని నుంచి 4.26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును ప్లాంట్‌కు తరలించారు.అదేవిధంగా వీజూ, రాజుజూ సంస్థల నుంచి 4.6 లక్షల టన్నుల బొగ్గు కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకు న్నారు. వీజూ, జుజూ సంస్థల నుంచి రెండు యూనిట్లకు ఏడా దికి 7.71 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు ఆమోదం లభిం చింది. ప్లాంట్‌లో బొగ్గు నిర్వహణ వ్యవస్థలో తలెత్తుతున్న సాంకే తిక సమస్యలను పరిష్కరించేందుకు ఎ++జుచీజూ, దీఎజూ సంయుక్తంగా చర్యలు చేపట్టాయి. బొగ్గు సరఫరా మార్గాల మరమ్మతులు, కన్వేయర్ బెల్టులు, క్రషర్లు, ఫీడర్లు, ఇతర పరికరాల ఆధునికీకరణ పనులు చేపడుతున్నాయి. ఈ పనులు పూర్తయితే బొగ్గు రవాణా సామర్థ్యం పెరిగి విద్యుత్ ఉత్పత్తికి ఆటంకాలు తగ్గనున్నాయి. నవంబర్ 11న రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి తొలిసారిగా 6,088 మెగావాట్ల ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయికి చేరిం ది. ఇందులో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 2,754 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసింది. ప్లాంట్‌లోని యూనిట్ల పనితీరు, బొగ్గు సరఫరా వ్యవస్థను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో విద్యుత్ శాఖ అధికారులు, TGGENCO, BHEL ప్రతినిధులు సమన్వయంతో పనులను పర్యవేక్షిస్తున్నారు. ఐదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమై, బొగ్గు సరఫరా వ్యవస్థ బలోపేతమైతే యాదాద్రి ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేయనుంది. తద్వారా రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తీర్చడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.ఎడిటింగ్ గమనిక: ప్రచురణకు ముందు యాదాద్రి వార్తలో బొగ్గు సరఫరాకు సంబంధించి వీజూ, రాజుజూ, జుజూ వివరాలు, అలాగే ఉస్మానియా యూనివర్సిటీ నియామక ఉత్తర్వుల్లో పేర్లు, పదవుల వివరాలు ఒకసారి అధికారికంగా ధ్రువీకరించుకోవడం మంచిది. మీరు ఇచ్చిన సమాచారంలోని ముఖ్యమైన గణాంకాలను యథాతథంగా ఉంచాను.

సంక్రాంతి, శబరిమలకు ప్రత్యేక రైళ్లు.. జీఎం హామీ

- సికింద్రాబాద్--అయోధ్యకు నేరుగా రైలు నడపాలని డా. కె. లక్ష్మణ్ విజ్ఞప్తి
- చర్లపల్లి టెర్మినల్‌కు ఎంఎంటీఎస్ కనెక్టివిటీ పెంచాలి



హైదరాబాద్, నవంబర్ 17 :

తెలంగాణ రాష్ట్ర ప్రజలు, ప్రయాణికులు, భక్తుల సౌక ర్యార్థం రైల్వే కనెక్టివిటీని మరింత మెరుగుపరచాలని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా. కె. లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు బీజేపీ నేతల బృందంతో కలిసి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌ను కలిసి పలు రైల్వే సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.రానున్న సం క్రాంతి పండుగ, శబరిమల యాత్ర నేపథ్యంలో ప్రయా ణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, తిరుపతి తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో ఇప్పటికే రిజర్వేషన్లు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన ప్రాంతాలకు అదనపు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉత్తర భారతదేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం సికింద్రాబాద్ నుంచి వారణాసి, ప్రయాగ్‌రాజ్ మీదుగా అయోధ్యకు నేరుగా రైలు సర్వీసు ప్రారంభిం చాలని కోరారు. సికింద్రాబాద్-దానాపూర్ మధ్య అదనపు రైలు, సికింద్రాబాద్--గోరఖ్‌పూర్ మధ్య ప్రతిరోజూ ప్రత్యేక రైలు నడపాలని సూచించారు. శబరిమల యాత్రికుల కోసం సికింద్రాబాద్, చర్లపల్లి లేదా కాచిగూడ నుంచి తిరువనంతపురం వరకు అదనపు రెగ్యులర్ రైలు ఏర్పాటు చేయాలని కోరారు. హైదరాబాద్ నగర ప్రయాణికుల సౌకర్యార్థం ఫలక్‌నుమా--లింగంపల్లి మధ్య రోజంతా ఎంఎంటీఎస్ రైళ్ల ఫ్రీక్వెన్సీ పెంచాలని డా. లక్ష్మణ్ సూచించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళలతో పాటు ఇతర సమయాల్లోనూ తక్కువ విరామంతో రైళ్లు నడపాలని కోరారు. ఫలక్‌నుమా, యాకుత్‌పురా, దబీర్‌పురా, మలక్ పేట ప్రాంతాల ప్రయాణికులు సికింద్రాబాద్ చేరుకునేలా రైళ్ల వేళలను రూపొందిం చాలని విజ్ఞప్తి చేశారు.కొత్తగా అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌కు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని, సికింద్రాబాద్, లింగంపల్లి, ఫలక్ నుమా, కాచిగూడ నుంచి అదనపు ఎంఎంటీఎస్ సర్వీసులు నడపాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసు కుని అప్రోచ్ రోడ్లు, ఆర్టీసీ బస్సులు, ఆటో, ట్యాక్సీ సదుపా యాలను మెరుగుపరచాలని సూచించారు.అలాగే, నల్గొండ జిల్లాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రామన్నపేట పట్టణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారుల ప్రయాణ సౌకర్యార్థం రామన్నపేట రైల్వే స్టేషన్‌లో నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ కల్పించాలని కోరారు. ఈ ప్రతిపాద నలపై సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించి రైల్వే బోర్డుకు పంపాలని జీఎంను అభ్యర్థించారు. డా. కె. లక్ష్మణ్ వినతులపై దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సానుకూ లంగా స్పందించారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబ రిమలకు 27 ప్రత్యేక రైళ్లు, సంక్రాంతి పండుగ సందర్భ ంగా ఆంధ్రప్రదేశ్‌కు 40 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు హామీ ఇచ్చారు. మిగిలిన నూతన రైళ్లు, హాల్టింగ్‌లు, ఎంఎంటీఎస్ సర్వీసుల ప్రతిపాదనలను రైల్వే బోర్డు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఓయూలో నాలుగు కళాశాలలకు కొత్త ప్రిన్సిపాళ్లు



- ఇద్దరు ప్రిన్సిపాళ్ల పదవీకాలం పొడిగింపు
- విద్యా ప్రమాణాల పెంపునకు వీసీ సూచనలు



హైదరాబాద్, నవంబర్ 17 :

ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు కళా శాలలకు నూతన ప్రిన్సిపాళ్లను నియమిస్తూ, మరో ఇద్దరు ప్రిన్సిపాళ్ల పదవీకాలాన్ని పొడిగిస్తూ వీసీ ప్రొఫెసర్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు.సోమవారం రాత్రి జరిగిన కార్యక మంలో నూతనంగా నియమితులైన ప్రిన్సిపాళ్లకు, పదవీ కాలం పొడిగించిన వారికి నియామక ఉత్తర్వులు అంద జేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాల య అభివృద్ధికి ప్రిన్సిపాళ్లు అందించిన సేవలను అభిన ందించారు. పదవులు తాత్కాలికమైనప్పటికీ సంస్థ పట్ల అంకితభావం, మానవ సంబంధాలు శాశ్వతమని పేర్కొన్నా రు.యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజ్ఞులత, నిజాం కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి. శ్రీనివాస్ పదవీకాలాన్ని పొడిగించారు.నూతన నియామకాలలో భాగంగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇంగ్లీష్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ బి. విజయ, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ శ్రీను నా యక్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎ. ప్యాట్రిక్ నియ మితులయ్యారు.కొత్తగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాళ్లు సుపరిపాలన, సమష్టి కృషి, సంస్థాగత బాధ్యతలకు ప్రాధా న్యత ఇవ్వాలని వీసీ సూచించారు. విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల సంక్షేమం, విశ్వవిద్యాలయ సమగ్ర అభివృ ద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేష్ రెడ్డి, వీసీ ఓఎస్డీ ప్రొఫెసర్ ఎస్. జితేందర్ కుమార్ నాయక్, మాజీ ప్రిన్సిపాళ్లు, నూతన ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ మాస్టర్ రోహిత్ కుమార్ బదిలీ



హైదరాబాద్, నవంబర్ 17 :

మల్కాజిగిరి రైల్వే స్టేషన్ మాస్టర్‌గా నాలుగున్నరేళ్ల పాటు విధులు నిర్వహించిన రోహిత్ కుమార్ కాచిగూడ రైల్వే స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న సిగ్నల్ అండ్ టెలికాం, ఆపరేటింగ్ విభాగాల సిబ్బంది ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ శంసుల్ హాక్, నూర్ తో పాటు రైల్వే ఉద్యోగులు, యూని యన్ నాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు ఏఎన్‌జీఆర్ఏయూ సంసిద్ధం

పంటల రక్షణకు రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి: ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ

గుంటూరు, నవంబర్ 17:బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం నెల్లూరు--తుని మధ్య ఆంధ్రప్రదేశ్ తీరాన్ని దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తున్న నేపథ్యంలో, తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అప్రమత్తమైం ది. తుపాను తీరం దాటే సమయంలో అత్యంత తీవ్ర తుపానుగా మారి గంటకు 120--130 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గా లులు వీచే అవకాశం ఉందని, రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, నీటిముంపు పరిస్థితులు ఏర్పడవచ్చని అంచనా వేస్తు న్నారు. ఈ నేపథ్యంలో పంటలకు నష్టం వాటిల్లకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచి స్తున్నారు. లాంలోని విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలో మంగళ వారం ఉపకులపతి డాక్టర్ పి.వి. సత్యనారాయణ అధ్యక్షతన 'అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు ఏఎన్‌జీఆర్ఏయూ సంసి ద్ధత'పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పంటల ప్రస్తుత ఎదుగుదల దశలను పరిగణనలోకి తీసుకుని, తుపా ను ప్రభావం నుంచి పంటలను కాపాడేందుకు రైతులు పాటిం చాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పంటల వారీగా చేపట్టాల్సిన యాజ మాన్య చర్యలపై చర్చించారు. ఈ మేరకు శాస్త్రవేత్తలకు ఉపకులపతి పలు సూచనలు చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో అక్వాన్ తుపానును ఎదుర్కొనేం దుకు సిద్ధంగా ఉండాలని ఆయన ఆదేశించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో విశ్వవిద్యాలయ వివిధ విభాగాల అధిపతులు, రాష్ట్రంలోని పరిశోధనా కేంద్రాలు, విస్తరణ కేంద్రాలు, వ్యవసాయ కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పుల్లారెడ్డి ఆదేశాలు

విజయవాడ, నవంబర్ 17:

అక్వాన్ తుపాను నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి అధికారులను ఆదే శించారు. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల కారణంగా విద్యు త్ స్తంభాలు, తీగలు దెబ్బతినే ప్రమాదం ఉన్నందున అధికా రులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫ రాలోఅంతరాయాలు ఏర్పడిన ప్రాంతాల్లో వెంటనే స్పందించి, సాధ్య మైనంత త్వరగా సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశిం చారు.

ప్రజలు పాటించాల్సిన విద్యుత్ భద్రతా సూచనలు

వర్షాలు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా ఉండాలి.తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు.నీరు నిలిచిన ప్రాంతాల్లో విద్యుత్ పరికరాలు, స్తంభాల సమీపానికి వెళ్లకూడదు.ఒరిగిన విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలు, ఇతర విద్యుత్ ప్రమాదాలను వెంటనే అధికారులకు తెలియజేయాలి.

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

ప్రతి ఇంటికీ ఇందిరమ్మ జీవిత బీమా పథకం

ప్రభుత్వ విఫ్ పట్నం మహేందర్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 17 :

ప్రతి ఇంటికీ ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఈ నెల 19 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలవు తుందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.మేడ్చల్ నియోజకవర్గంలో రెండో రోజు అయన పర్య టించారు. ఈ సందర్భంగా బీఎన్ఆర్ కన్వెన్షన్ అత్తివెల్లిలో కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజే శారు. దమ్మాయిగూడ సాయిభవానీ ఫంక్షన్ హాల్‌లో కీసర సర్కిల్ పరిధిలోని 2,500 మంది చేయూత పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భం గా రూ.5 కోట్ల నిధులతో తూముకుంట ఇంది రమ్మ ఇండ్ల పరిసరాల్లో వ్యర్థ, వర్షపు నీటి ప్రవా హ కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడలోని ఆర్ జేకే కాలనీలో రూ.5 కోట్ల నిధులతో వ్యర్థ, వర్షపు నీటి ప్రవాహ కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మహేం దర్ రెడ్డి మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి కుటుం బాన్ని ఆదుకునే సదుద్దేశంతో ఈ ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. 18-59 ఏండ్ల వయసు మధ్య గల కుటుంబ యజమానికి రూ.5 లక్షల బీమా పథ కాన్ని ప్రభుత్వం అందించనుందని తెలిపారు. రాష్ట్రంలో కొత్తగా 4 లక్షల 63వేల మందికి చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని చెప్పారు. ఇందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.114 కోట్లు భరిస్తుందన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొత్తగా 25,553 చేయూత పింఛన్లు మంజూ రవగా, మేడ్చల్ నియోజకవర్గంలో 6,681 మందికి, ఉప్పల్ లో 4,278 మందికి, మల్కా జిగిరిలో 2,705 మందికి, కుత్బుల్లాపూర్ లో 6,685 మందికి, కూకట్‌పల్లిలో 5,203 మం దికిచేయూత పింఛన్లు మంజూరైనట్టు మహేం దర్ రెడ్డి వివరించారు. నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తున్నట్టు తెలిపారు. ఉచిత బస్సులతో మహిళలందరికీ గౌరవంగా రాష్ట్రమంతా తిరిగేలా అవకాశం కల్పించినట్టు చెప్పారు. కొత్త రేషన్ కార్డులు, రూ.500 కే వంట గ్యాస్ అందించడం లాంటి సంక్షేమ పథకాలు ప్రతి నిరు పేదకూ చేరిందన్నారు. రాష్ట్రంలో ప్రతి నిరుపేద సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా విధానాలు సాగుతున్నాయని తెలిపారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా పేదల సంక్షేమం కోసం కృషి చేసిదై ఉండాలన్నారు. రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదనీ, సంక్షేమం మాత్రమే శాశ్వతం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పేదల కోసం తపించాల్సిందేనన్నారు. ఇంకా పెన్షన్ అందని వారందరికీ అవకాశం కల్పించాలని కోరారు. కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా తాము కృషి చేస్తున్నట్టు చెప్పారు. సమన్వయంగా పనిచేస్తే ప్రభుత్వ పథకాలన్నీ విజయవంతం అవుతాయన్నారు.డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. కాలనీల్లో డ్రయినేజీ, వరద నీటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీని నెర వేర్చుకునేలా పెన్షన్ రూ.4వేలు అందించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతిపక్షాలను కలుపుకుని పోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిసరి మహిపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు మహమ్మద్ ముజీబ్ రుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన ఆత్మగౌరవంపై కాంగ్రెస్ కత్తి..!

- బిఆర్ఎస్ సర్పంచ్ పై కాంగ్రెస్ గుండాల దాడి అమానుషం..!
- పాలకుర్తిలో భగ్గుమన్న బీఆర్ఎస్ నిరసన జ్వాల..
- గిరిజన ప్రజాప్రతినిధులపై కాంగ్రెస్ అక్కసు..
- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఉసిగొల్పడం వల్లే సర్పంచ్‌పై దాడి జరిగిందని బీఆర్ఎస్ నేతల ఆరోపణ
- రాజీవ్ చౌరస్తాలో మహా ధర్నా.. ప్రభుత్వానికి, స్థానిక కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా నినాదాల హోరు
- ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులు..
- ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట, పట్టణంలో ఉద్రిక్తత
- రణరంగంగా మారిన పాలకుర్తి
- బాధిత సర్పంచ్ బానోత్ మహేందర్ నాయక్, పసునూరి నవీన్, ధరావత్ గాంధీ నాయక్‌ల అరెస్ట్
- దాడిపై నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు వినతిపత్రం




హైదరాబాద్, నవంబర్ 17 :

జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం రాజకీయ వాతా వరణం ఒక్కసారిగా వేడెక్కింది. గిరిజన సర్పంచ్ బానోత్ మహేందర్ నాయక్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున రోడ్డెక్కడంతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గిరిజన ప్రజాప్రతినిధులపై అధికార కాంగ్రెస్ పార్టీ అక్కసు వెళ్లగక్కుతోందని, స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ఉసిగొ ల్పడం వల్లే ఈ దాడి జరిగిందని బీఆర్ఎస్ నాయకులు తీవ్ర స్థాయిలో ఆరోపించారు. స్థానిక రాజీవ్ చౌరస్తాలో నిర్వహించిన మహా ధర్నాలో పాలకుర్తి మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకత్వంపై విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన గిరిజన ప్రజాప్రతి నిధులను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిల ప్రోద్బలంతోనే నియోజకవర్గంలో దాడు లు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. గిరిజన ప్రజాప్రతిని ధులకే రక్షణ లేకపోతే సామాన్య గిరిజనుల, ప్రజల పరిస్థితి ఏమిటని బీఆర్ఎస్ నేతలు ప్రభు త్వాన్ని నిలదీశారు. గిరిజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ఇలాంటి అమానుష ఘటనలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటివని, వీటిని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని వారు స్పష్టం చేశారు. రాజీవ్ చౌరస్తాలో బైఠాయించిన బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రభుత్వానికి, స్థానిక కాంగ్రెస్ నేతలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో రాజీవ్ చౌరస్తా ప్రాంతం కొంతసేపు ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో బాధిత గిరిజన సర్పంచ్ బానోత్ మహేందర్ నాయక్, పాలకుర్తి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పసునూరి నవీన్, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీ నాయక్‌లను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు దాడి ఘటనపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్ నేతలు పోలీసులకు వినతిపత్రం అందజేశారు. బాధిత సర్పంచ్ మహేందర్ నాయక్‌కు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం తమ పోరాటం కొనసాగిస్తామని పార్టీ శ్రేణులు స్పష్టం చేశాయి.భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు ఈ నిరసన కార్యక్రమంలో పాలకుర్తి మండల గిరిజన నాయకులు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా మరియు మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, మహిళలు, యువజన విభాగం నాయకులు, సోషల్ మీడియా విభాగం కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

తీరం వైపు దూసుకొస్తున్న 'అక్వాన్'..

మూడు రోజులపాటు భారీ వర్షాలు



హైదరాబాద్, నవంబర్ 17 : బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను క్రమంగా బలపడుతూ తీరం వైపు దూసుకొస్తున్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ప్రస్తుతం మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైందని తెలిపారు. గత ఆరు గంటలుగా గంటకు 3 కి.మీ వేగంతో చాలా నెమ్మదిగా కదులుతున్నదని, రాబోయే 12 గంటల్లో మరింత బలపడి తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్టు తెలిపింది.నవంబర్ 19న ఉదయానికి అతి తీవ్ర తుపానుగా రూపాంతరం చెందే సూచనలు ఉన్నట్టు పేర్కొన్నారు. ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న ఈ తుపాను ఈ నెల 20న ఏపీ తీరాన్ని దాటే సమయంలో గంటకు 120 నుంచి 145 కి.మీ వేగంతో ప్రచండ గాలులు వీచే అవకాశం ఉందని, దీని ప్రభావంతో నవంబర్ 20 నుంచి 22 వరకు తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ

స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతాం!

- ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తాం..
- మంత్రి వాకిటి శ్రీహరి
- రూ.203.36 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాల క్రీడా సదుపాయాలు..
- రాబోయే 20 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధి



హైదరాబాద్, నవంబర్ 17 : తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అత్యుత్తమ స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్--2026 నిర్వహణ తెలంగాణ క్రీడా చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలకనుందని పేర్కొన్నారు. ఈ పోటీలను గతంలో జరిగిన ఏడు ఎడిషన్ల కంటే మెరుగైన ప్రమాణాలతో నిర్వహించి తెలంగాణ సత్తాను దేశానికి చాటాలని పిలుపునిచ్చారు.మంగళవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఇన్వెస్ట్ తెలంగాణ, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణపై ప్రముఖ క్రీడాకారులతో మంత్రి ముఖాముఖి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా నిర్వహణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.203.36 కోట్లు కేటాయించడంపై ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం చేయకుండా రాబోయే 15 నుంచి 20 ఏళ్లపాటు ఉపయోగపడే శాశ్వత క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తున్నట్లు వివరించారు. గచ్చిబౌలి స్టేడియం, ఎల్బీ స్టేడియంతో పాటు రాష్ట్రంలోని ఇతర క్రీడా వేదికలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. స్టేడియాలు, గ్రౌండ్లు, ట్రాక్‌లు, శిక్షణ కేంద్రాలు, క్రీడా పరికరాల విషయంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్వెస్ట్ తెలంగాణ కార్యక్రమం ద్వారా క్రీడా రంగానికి భారీగా పెట్టుబడులు ఆకర్షించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక శిక్షణ కేంద్రాలు, అంతర్జాతీయ స్థాయి స్టేడియాలు, స్పోర్ట్స్ సైన్స్, క్రీడా పరికరాలు తదితర రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. క్రీడా రంగాన్ని ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు పెట్టుబడులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అంతర్జాతీయ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఖేలో ఇండియా నిర్వహణలో ప్రముఖ క్రీడాకారులు, మాజీ అంతర్జాతీయ క్రీడాకారుల భాగస్వా మ్యం కీలకమని మంత్రి అన్నారు. ప్రముఖ క్రీడాకారులకు ఒక్కో క్రీడా వేదిక బాధ్యతలు అప్పగించి, వారి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేపట్టే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులు అందించే సూచనలను స్వీకరించి, ఆచరణ సాధ్యమైన వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించనున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా క్రీడా పండుగ వాతావరణం కల్పిస్తామని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా వేలాది మంది క్రీడాకారులు, కోచ్‌లు, సాంకేతిక సిబ్బంది హాజరుకానున్నందున వారికి నాణ్యమైన వసతి, ఆహారం, తాగునీరు, రవాణా, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగే పోటీల నిర్వహణకు మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యార్థులను ప్రత్యేక బస్సుల ద్వారా క్రీడా వేదికలకు తీసుకువచ్చి పోటీలను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం కల్పిస్తామని మంత్రి వెల్లడించారు. ప్రముఖ క్రీడాకారుల ఆటతీరును చూసి విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, స్ఫూర్తి పెరుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. తెలంగాణ నుంచి భవిష్యత్తులో ఒలింపిక్ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా రంగాన్ని అభివృద్ధి చేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో క్రీడా కార్యక్రమాలు, నిరంతర శిక్షణ, ఆధునిక సదుపాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో క్రీడా రంగానికి రూ.1,500 కోట్ల నుంచి రూ.2,000 కోట్ల వరకు నిధులు సాధించే దిశగా కృషి చేస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలాదేవితో పాటు ప్రముఖ క్రీడాకారులు జె.జె. శోభ, నీతా ఎల్. దాద్వే, ఇస్మాయిల్ బేగ్, ఈషా సింగ్, అంబటి తిరుపతి రాయుడు, అగసర నందిని, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా, నిఖత్ జరీన్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కేవలం క్రీడా పోటీలు మాత్రమే కాదని, తెలంగాణ క్రీడా భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. అధికారులు, క్రీడాకారులు, ప్రజాప్రతినిధులు, యువత సమష్టిగా కృషి చేసి దేశంలోనే అత్యుత్తమంగా ఈ పోటీలను నిర్వహించాలని పిలుపునిచ్చారు.

అణచివేతపై కలం గర్జన..

- అక్రమార్కుల గుండెల్లో నిద్రపోయే తూటా!
- తలవంచని కలం.. తెగింపు ఉన్న గళం!
- పేలే బందూక్‌లా మారిన నిజం..!
- అడుక్కు తినకు...ఆత్మగౌరవ పోరాటంలో కదం తొక్కు..

హైదరాబాద్, నవంబర్ 17 :

ప్రజాస్వామ్యానికి నాలుగోస్తంభంగా నిలిచే జర్న లిజం విలువలపై, పాత్రికేయుల ఆత్మ గౌర వం పై నేడు సర్వత్రా ఆసక్తికర చర్చ నడుస్తోంది. అధికారం ముందు తలవంచకుండా, నిజాలను నిర్భయంగా బయటపెట్టే కలం యోధుల స్వేచ్ఛపై దాడి జరుగుతున్న వేళ ఒక శక్తివంతమైన నినాదం ఇప్పుడు మీడియా వర్గాల్లో, ప్రజా క్షేత్రంలో సంచలనంగా మారింది. "జర్నలి స్టు లు ఎవరికీ బానిసలు కాదు.. వారు సమాజం కోసం పేలే బందూక్ లాంటి వాళ్లు" అనే మాట ఇప్పుడు ప్రతి జర్నలిస్టు గుండెల్లో నినాదంగా మారుతోంది.

తలవంచని కలం.. తెగింపు ఉన్న గళం!

సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను ప్రశ్నించే గొంతుక జర్నలిస్టు. కానీ, మారుతున్న కాలంతో పాటు కొందరు పాలకులు, యాజమా న్యాలు జర్నలిస్టులను తమ చెప్పుచేతల్లో ఉంచు కోవాలని చూడటం తీవ్ర విమర్శలకు దారితీ స్తోంది. ఒక సాధారణ వ్యక్తికి ఆపద వస్తే గుర్తొ చ్చేది పోలీసు,,ఆ తర్వాత జర్నలిస్టు. అలాంటి జర్నలిస్టులకే రక్షణ లేకపోతే, వారి స్వేచ్ఛను హరించాలని చూస్తే సమాజం అంధకారంలోకి వెళ్లిపోతుంది. జర్నలిస్టు చేతిలో ఉండే పెన్ను, కెమెరా కేవలం వస్తువులు కావు.. అవి అవి నీతి పై ఎక్కుపెట్టిన తుపాకులు. ఎవరో విసిరే ఎం గిలి మెతుకులకు ఆశపడి భజన చేసే బానిస త త్వం నిజమైన పాత్రికేయుడి రక్తంలోనే ఉండ దని సీనియర్ జర్నలిస్టులు స్పష్టం చేస్తున్నారు.

పేలే బందూక్‌లా మారిన నిజం..!

ప్రశ్నించే తత్వం,,అధికారం ఎవరిదైనా సరే, తప్పు జరిగితే ఎత్తిచూపడమే జర్నలిజం అసలు ధర్మం. భయం లేని ప్రయాణం: బెదిరింపులకు, తప్పుడు కేసులకు భయపడి నిజాన్ని దాచిపెట్టే రోజులు పోయాయి.

ప్రజల పక్షం: జర్నలిస్టు ఎప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాడు. అణచివేత ఎక్కువైనప్పుడల్లా కలం మరింత పదునెక్కి బందూక్‌లా గర్జిస్తుంది.

చరిత్రను మలుపుతిప్పే శక్తి

పాత్రికేయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవ హరించే వారికి ఇదొక గట్టి హెచ్చరికగా మా రింది. "మేము కేవలం వార్తలు రాసే యంత్రా లం కాదు, సమాజాన్ని జాగృతం చేసే సైని కు లం" అని జర్నలిస్టు సంఘాలు ముక్తకంఠంతో నినదిస్తున్నాయి. కలం కదిలితే చరిత్ర మారుతుంది. జర్నలిస్టు అనే బందూక్ పేలితే అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడతాయి. అందుకే, జర్నలిస్టులను గౌరవించడం అంటే ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడమేనని మేధావి వర్గం అభిప్రాయపడుతోంది.

కాలువల నుంచి చుక్క నీరూ ఇవ్వం..

- ఆడపిల్లల శారీ ఫంక్షన్లు జరుపుకోవద్దు..
- మంత్రి జూపల్లి ప్రవచనాలు



హైదరాబాద్, నవంబర్ 17 : 'పంటలు సాగు చేయొద్దు.. ఫంక్షన్లు చేసుకోవద్దు' అని మంత్రి జూపల్లి కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ ప్రజలకు, రైతులకు హుకుం జారీ చేశారు. జూపల్లి వరుసగా రెండ్రోజుల పాటు చేసిన వ్యాఖ్యలను ప్రజలు తప్పుబడుతున్నారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లోని రాజాగారి బంగ్లా ఎదుట నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ కల్వకుర్తి, భీమా, జూరాల కాలువల కింద రెండో పంట సాగు చేయొద్దని రైతులకు సూచించారు. కాలువలకు చుక్క నీరు కూడా ఇచ్చేది లేదని స్పష్టంచేశారు. బావుల కింద సాగు చేసుకునే రైతులు సైతం ఆరుతడి పంటలకే పరిమితం కావాలని ఆదేశించారు. కరెంట్ కూడా వచ్చేది లేదని తెగేసి చెప్పారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో ఉన్న రైతులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఇదిలావుండగా మంగళవారం చిన్నంబావి మండల కేంద్రంలో చేయూత పింఛన్ల కార్యక్రమంలో ఆడపిల్లల ఫంక్షన్లు చేసుకోవద్దని ప్రజలకు సూచించడం మరోసారి చర్చకు తెరలేపింది. ప్రజల నిర్వహించుకునే శు భకార్యాలపై ఆంక్షల తరహాలో మంత్రి జూపల్లి సూచనలు చేయడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఆడపిల్లల శారీ ఫంక్షన్లు చేయొద్దంటూ మంత్రి పేర్కొన్నడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి.కృష్ణానదిలో నీళ్లున్నా పంటలకు సాగునీరందించడం చేతకాని మంత్రి జూపల్లి కృష్ణారావు రైతులను పంటలు వేసుకోవద్దని చెప్పడం సిగ్గుచేటని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. రైతుల ఆర్థిక స్థితిని దెబ్బతీస్తూ మరో పక్క ఆడపిల్లల ఫంక్షన్లు చేసుకోవద్దని చెప్పడాన్ని తప్పుబట్టారు. నది నీటిని ఎత్తిపోసి ఉంటే రిజర్వాయర్లలో 50 టీఎంసీల వరకు నిల్వ ఉండే అవకాశం ఉండేదని, రైతుల పంటలు పండి ఆర్థికంగా అన్ని వర్గాల వారు సుభిక్షంగా ఉండేవారి పేర్కొన్నారు. కొల్లాపూర్ ప్రజలు బాగుపడటం జూపల్లికి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. అందుకే పంటలు వేసుకోవద్దు, ఫంక్షన్లు చేసుకోవద్దని అంటున్నారని దుయ్యబట్టారు. జూపల్లి కుటుంబంలో ఫంక్షన్ జరుపుకోకుండా ఉంటారా? అని ప్రశ్నించారు.

CINEMA

‘విశ్వంభర’పై రిస్క్ బెట్?

ఆ సినిమాల్లా మ్యాజిక్ చేయాల్సిందే!

టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటించిన లేటెస్ట్ చిత్రాల్లో ఒకటే ‘విశ్వంభర’. యువ దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన ఈ విజువల్ ఫాంటసీ వండర్ పట్ల అప్పట్లో నెలకొన్న హైప్ వేరు. కానీ ఆ హైప్ లో విడుదల చేసిన కంటెంట్ తో మొత్తం మారిపోయింది. అక్కడ నుంచి సినిమా ఆలస్యం అయ్యి ఇప్పటికీ విడుదల ఎప్పుడు అవుతుందో అర్థం కాని పరిస్థితి. కానీ ఎట్టకేలకి ఈ సినిమా పనులు ఒక కొలిక్కివ స్తున్న నేపథ్యంలో తెలంగాణ మార్కెట్ లో భారీ మొత్తానికే సినిమా బిజినెస్ చేసినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వాల్తేరు వీరయ్య తో భారీ లాభాలు అందుకున్న డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రి డిస్ట్రిబ్యూషన్ వారు ఏకంగా 40 కోట్లకు ఈ సినిమా హక్కులు కొన్నట్టుగా ఇపుడు తెలుస్తుంది. చాలా కాలంగా ఆలస్యం అవుతూ వచ్చిన ఈ ప్రాజెక్ట్ పై ఈ రేంజ్ బెట్ అంటే ఒకింత రిస్క్ కూడా అనుకోవాలి.కానీ ఈ రేంజ్ లో పెడుతున్నారంటే అక్కడ మెగాస్టార్ ఇంకా సినిమా కంటెంట్ పై కూడా ఉన్న నమ్మకం కోసం కూడా అనుకోవచ్చు. కానీ వీటికి భిన్నమైనది ఆడియెన్స్ లో ఉన్న రియాలిటీ. ఇంతలా లేట్ అవుతూ థియేటర్స్ లోకి వచ్చాక హిట్ అయ్యిన సినిమాలు చాలా తక్కువే కనిపిస్తాయి. ఈ ఏడాదిలో లెనిన్, అనగనగా ఒకరాజు వంటివి మ్యాజిక్ చేసాయి.చాలా ఆలస్యం అయిన ప్పటికీ మేకర్స్ ఏదో చేసి ఫైనల్ గా హిట్ మార్క్ అందుకు న్నారు. అలానే మన బిగ్ స్టార్స్ లో కూడా పుష్ప 2, ఓజి, దేవర వంటివి ఆలస్యం అయినా హిట్ అయ్యాయి. కానీ వీరిలోనే రాజా సాబ్, ఉస్తాద్ భగత్ సింగ్, హరి హర వీరమల్లు లాంటి లేట్ ప్రాజెక్ట్ లు ప్లాప్ లుగా కూడా మిగిలాయి. సో ‘విశ్వంభర’ ఏ కోవలోకి వెళుతుందో అనేది కాలమే నిర్ణయించాలి.





వన్ మోర్ ఛాన్స్..

కాల్పుల ఘటన తర్వాత రీఎంట్రీ ఇచ్చిన టైగర్ ష్రాఫ్!



ముంబైలోని జుహులో తన కారుపై జరిగిన కాల్పుల ఘటన నుంచి తృటిలో తప్పించుకున్న బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్ ఎట్టకేలకు సోషల్ మీడియాలోకి రీఎంట్రీ ఇచ్చారు. నుష్రత్ భరూచాతో కలిసి నటిస్తున్న తన కొత్త మ్యూజిక్ సింగిల్ టీజర్‌ను ఆయన అభిమానులతో పంచుకున్నారు. అయితే, ఈ పోస్ట్‌కు ఆయన పెట్టిన “వన్ మోర్ ఛాన్స్, వన్ మోర్ డాన్స్” అనే క్యాప్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అక్టోబర్ 18న జరిగిన కాల్పుల ఘటన తర్వాత, ఆయన చేసిన ఈ పోస్ట్ జీవితంపై మరో అవకాశం అనే అర్థాన్ని ఇస్తోందంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు.గత నెల అక్టోబర్ 18న సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఫుట్‌బాల్ ప్రాక్టీస్ ముగించుకుని కారులో వస్తున్న టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా దుండగులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో టైగర్ ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఆయన డ్రైవర్ మరియు ఒక వ్యక్తి గాయపడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా దర్యాప్తు చేపట్టి, నవంబర్ 15 నాటికి సుమారు 14 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఈ తీవ్రమైన ఘటన తర్వాత సోషల్ మీడియాకు దూరంగా ఉన్న టైగర్ ష్రాఫ్, ఇప్పుడు తన కొత్త ప్రాజెక్ట్‌తో తిరిగి రావడంతో పాటు ప్రాణాపాయం నుంచి బయటపడిన తర్వాత చేసిన ఈ పోస్ట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

విజయ్ దేవరకొండ ‘రణబాలి’కి ఓటీటీలో

అద్భుతమైన స్పందన.. నెట్‌ఫ్లిక్స్‌లో ట్రెండింగ్!



విజయ్ దేవరకొండ హీరోగా, రష్మిక మందన్న హీరోయిన్‌గా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’ ఇటీవల నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా విడుదలై సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. థియేటర్ల తర్వాత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో అడుగుపెట్టిన ఈ చిత్రానికి ఊహించని విధంగా భారీ స్పందన లభిస్తోంది. ముఖ్యంగా హిందీ ప్రేక్షకులతో పాటు వివిధ భాషల ప్రేక్షకులు ఈ సినిమాపై తీవ్ర ఆసక్తి చూపుతున్నారు.ఈ చిత్రంలో చూపించిన చారిత్రక సంఘటనలు, బ్రిటిష్ కాలం నాటి పరిస్థితులు ప్రస్తుతం సోషల్ మీడియాలో పెద్దఎత్తున చర్చకు దారితీశాయి. కొంతమంది బ్రిటన్ నెటిజన్లు సినిమాలో చూపించిన బ్రిటిష్ పాలన విధానాలపై స్పందిస్తుండగా, మరికొందరు వలసవాద పాలనలో భారతీయులు పడిన నష్టాలు మరియు జరిగిన దారుణాలను గుర్తుచేస్తూ పోస్టులు పెడుతున్నారు. మరోవైపు, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల నటనకు ప్రేక్షకులు ఫిదా అవు తున్నారు. వీరిద్దరి ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ, పవర్‌ఫార్మెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయని, జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా అద్భుతంగా నటించారని నెటిజన్లు కొనియాడుతున్నారు. దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ టేకింగ్, చరిత్రను నిజాయితీగా తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసల జల్లు కురుస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి అజయ్-అతుల్ సంగీతం అందించగా, టి-సిరీస్ సమర్పించింది. మొత్తానికి ఓటీటీలో వస్తున్న రెస్పాన్స్‌తో ‘రణబాలి’ సినిమా సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది.

సెన్సార్ పూర్తి చేసుకున్న ‘ఆకాశంలో ఒక తార’..

నవంబర్ 20న గ్రాండ్ రిలీజ్!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ లవ్ అండ్ ఎమోషనల్ డ్రామా ‘ఆకాశంలో ఒక తార’.పవన్ సాధినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి మరియు సెన్సార్ బోర్డు ఈ సినిమాకు ‘యూ/ఏ’ (ఖ/ూ) సర్టిఫికెట్ జారీ చేసింది.ఇక సినిమా విడుదలకు తేదీ దగ్గర పడుతుండటంతో మేకర్స్ చిత్ర ట్రైలర్‌ను అధికారికంగా విడుదల చేశారు. తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో విడుదలైన ఈ ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. చిత్రంలో సాత్విక వీరవల్లి కథానాయికగా నటిస్తుండగా, శృతి హాసన్ మరో కీలక పాత్రలో మెరువనున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ తదితర ప్రముఖ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ అద్భుతమైన సంగీతం అందించారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 20వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.


రూ. 139 కోట్ల బాక్సాఫీస్ సంచలనం..

ఓటీటీలోకి కన్నడ బ్లాక్‌బస్టర్ ‘ప్రేమద ఊరలి’!



కన్నడ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన ‘ప్రేమద ఊరలి’ సినిమా ఎట్టకేలకు ఓటీటీలోకి అడుగుపెట్టింది. కేవలం 60 షోలతో చాలా సాధారణంగా థియేటర్లలో విడుదలై, మౌత్ టాక్‌తో భారీ విజయాన్ని అందుకున్న ఈ చిత్రం రూ. 139 కోట్ల కు పైగా గ్రాస్ కలెక్షన్లను రాబట్టి చరిత్ర సృష్టించింది. కాగా, థియేటర్లలో విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకున్న ఈ రొమాంటిక్ ఫ్యామిలీ డ్రామా 17 నుంచి ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియోలో డిజిటల్ స్ట్రీమింగ్‌ను ప్రారంభిం చింది. మరోవైపు తెలుగులో కూడా ఈ చిత్రం ప్రేమనే ఊరిలో అనే పేరుతో విడుదలై పాజిటివ్ టాక్‌ని తెచ్చుకుం ది. మనోజ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రంగాయణ రఘు, శ్రీ రామ్, రామిక శివ తపస్విని పూనాచ ప్రధా న పాత్రల్లో నటించారు. భార్య మరణం తర్వాత తన కుమారుడు సంతును పెంచే ఒక సాధారణ రైతు నాగన్న (రంగాయణ రఘు) జీవితం వారి కుటుంబ బంధాల నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ప్రచార ఆర్భాటం లేకుండా కేవలం 60 షోలతో మొదలైన ఈ సినిమా, కుటుంబ ప్రేక్షకుల ఆదరణతో క్రమంగా పుంజుకుని కర్ణాటక వ్యాప్తంగా 450కి పైగా కేంద్రాలకు విస్త రించింది.నాని నటించిన ‘దిప్యారడైజ్’ శివరాజ్ కుమార్ ‘బెయి ల్’ వంటి భారీ చిత్రాల పోటీని తట్టుకుని నిలబ డిన ఈ చిత్రం, విడుదలైన 26 రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్ లో చేరింది. సుమారు 53 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 139.32 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి కన్నడ సినీ పరిశ్రమలో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. వానిల్లా ఎంటర్‌టైన్ మెంట్స్, జనకమ్మ ప్రొడక్షన్స్ పతాకాలపై మమత దేవేంద్ర, ప్రశాంత్ డి.ఎస్, రమేశ్ ఎన్ సం యుక్తంగా నిర్మించిన ఈ చిత్రా నికి సునాద్ గౌతమ్ సం గీతం అందించగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ బాధ్య త లు నిర్వర్తించారు. ప్రస్తుతం థియేటర్లలో ఘన విజయం సాధిం చిన ఈచిత్రం ఓటీటీలోనూ ప్రేక్షకులనుఅలరించడానికి సిద్ధమైంది.

‘అరుంధతి నక్షత్రం’ ప్రారంభం



ఆది సాయికుమార్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘అరుంధతి నక్షత్రం’ సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభ మైంది. ‘ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో’ ఫేమ్ రాహుల్ శ్రీనివాస్ దర్శ కత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశా నికి నటుడు సాయి కుమార్ క్లాప్‌నిచ్చారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ డ్రామా ఇదని, ఈ నెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభి స్తామని మేకర్స్ తెలిపారు. మేఘశెట్టి, మధు దామరాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఫహద్ అబ్దుల్ మజీద్, సంగీతం: సురేష్ బొబ్బిలి, నిర్మాతలు: సందీప్ అగరం, అమ్మిత రెడ్డి బాసాని, డా.సూర్యకాంతి కూఛిబొట్ల, రచన-దర్శకత్వం: రాహుల్ శ్రీనివాస్.

అవెంజర్స్ డూమ్స్‌డే

నెల ముందే ఇండియాలో మొదలైన బుకింగ్స్..

బుక్‌మైషోలో రికార్డు స్థాయిలో టికెట్ల సేల్స్!



మార్వెల్ అభిమానులు ఎంత గానో ఎదురుచూస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘అవెంజర్స్: డూమ్స్‌డే’ విడుదలకు సరిగ్గా నెల రోజులు మాత్రమే సమయం ఉంది. ఇండి యాలో ఈ సినిమాను డిసెంబర్ 17న గ్రాండ్‌గా రిలీజ్ చేయను న్నా రు. అగ్రరాజ్యం అమెరికా కం టే మన దేశంలోనే ఈ సిని మా ఒకరోజు ముందుగా థియేటర్లలోకి రానుంది. అభి మానుల అంచనా లకు తగ్గ ట్లుగా మేకర్స్ ఇప్పటికే అడ్వా న్స్ బుకింగ్స్ ఓపెన్ చేశారు. ప్రముఖ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో ‘అవెంజర్స్: డూమ్స్‌డే’ టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. బుకింగ్స్ ఓపెన్ చేసిన వెంటనే టికెట్ల సేల్స్ రికార్డు స్థాయిలో జరుగుతున్నాయి. బుక్‌మైషోలో గంటకు 9 వేల చొప్పున టికెట్లు అమ్ముడవుతూ భారీ ట్రెండ్ సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా ఐమ్యాక్స్, 4ణశ, ఇన్ఫినిటీ విజన్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో ఈ సినిమాను చూసేందుకు ఆడియన్స్ విపరీతమైన ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా ఇన్ఫినిటీ విజన్ టికెట్ల ధరలు కొన్ని నగరాల్లో రూ. 2 వేల వరకు పలుకుతున్నాయి.ఆంథోనీ, జో రుస్సో (రుస్సో బ్రదర్స్) దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఐరన్ మ్యాన్ ఫేమ్ రాబర్ట్ డౌనీ జూనియర్ ‘డాక్టర్ డూమ్’గా విలన్ పాత్రలో రీ-ఎంట్రీ ఇస్తుండటంతో అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. క్రిస్ ఎవాన్స్, క్రిస్ హేమ్స్‌వర్త్ వంటి స్టార్ హీరోలు కూడా ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

చిన్నారుల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



-పిల్లలను ప్రతిరోజూ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, ముస్తాబాద్:

చిన్నారుల సంపూర్ణ అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలకమని, తల్లిదండ్రులు ఆరేళ్లలోపు పిల్లలను ప్రతిరోజూ కేంద్రాలకు పంపించాలని,చిన్నారులకు పోషకాహారం అందించడంతోపాటు వారి ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.

మంగళవారం ముస్తాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన 'ప్రతి మంగళవారం 10 నిమిషాలు' కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను పరిశీలించారు. తీవ్ర, మధ్యస్థ పోషకాహార లోపం ఉన్న (సామ్, మామ్) పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. చిన్నారుల ఎదుగుదల పర్యవేక్షణ కార్డులను ఆవిష్కరించారు.

ప్రాథమిక పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

అనంతరం సమీపంలోని ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన ఏకరూప దుస్తులు ధరించిన విద్యార్థులతో ముచ్చటించి గణితం, ఇతర పాఠ్యాంశాలపై ప్రశ్నలు వేసి వారి విద్యా ప్రమాణాలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి మంగళవారం 10 నిమిషాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో మౌలిక వసతుల మెరుగుదల, పోషకాహార పంపిణీ, బాలల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు.

తల్లిదండ్రులు పిల్లల ఎత్తు, బరువును క్రమం తప్పకుండా నమోదు చేయించి, వారి ఎదుగుదలకు అనుగుణంగా పోషకాహారం అందించాలని తెలిపారు. ఆటలు, పాటలు, బొమ్మల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు విద్యాబోధన జరుగుతుందని వివరించారు. బాలల జీవితంలో తొలి వెయ్యి రోజుల దశ అత్యంత కీలకమని, ఈ సమయంలో తగిన పోషకాహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పునాది వేయవచ్చన్నారు. త్వరలో రక్తహీనత నివారణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు . సర్పంచులు సైతం అంగన్‌వాడీ కేంద్రాలను తరచూ సందర్శించి సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు .

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు ప్రతి ఆరు నెలలకోసారి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, నువ్వులు, బెల్లం, మునగ ఆకులు, కాయలను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు.ఎదుగుదల లోపాలు, వినికిడి, మాట, మానసిక వికాస సమస్యలు, నడవలేకపోవడం, పుట్టుకతో వచ్చే లోపాలు, మెదడుకు సంబంధించిన సమస్యలు, రక్తహీనత, పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గుర్తించిన పిల్లలకు ఆర్‌బీఎస్‌కే వాహనం సహాయంతో వేములవాడ ఏరియా ఆసుపత్రిలోని డీఈఐసీ కేంద్రంలో వైద్య సేవలు అందిస్తారని అన్నారు . అవసరమైన వారికి కరీంనగర్‌లోని పోషక పునరావాస కేంద్రం (ఎన్‌ఆర్‌సీ), హైదరాబాద్‌లో ఉన్నత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ ఫారూఖ్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.



19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అధికారులతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి బీమాకు సంబంధించిన దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పక్కాగా చేయాలని స్పష్టం చేశారు.

అర్హులందరికీ చేయూత పెన్షన్లు

-ముస్తాబాద్ మండలంలో 625 మందికి మంజూరు పత్రాలు

-రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,ముస్తాబాద్:

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. మంగళవారం ముస్తాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో మండలానికి చెందిన 625 మంది నూతన లబ్ధిదారులకు పింఛన్ అర్హత మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ .. చేయూత పింఛన్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, అర్హుల ఎంపికకు అధికారులతో క్షేత్రస్థాయిలో విచారణ చేయించినట్లు తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు మంజూరు పత్రాల పంపిణీ పూర్తిచేస్తామని, 19వ తేదీ నుంచి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ అవుతుందని అన్నారు . జిల్లా వ్యాప్తంగా 8,209 మందికి, ముస్తాబాద్ మండలంలో 625 మందికి నూతన పింఛన్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఇప్పటివరకు సుమారు నాలుగు వేల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తామని అన్నారు . ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల విలువైన బీమా సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో నెల రోజుల పాటు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి చీరలను కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి నిర్మల, తహసీల్దార్, ఎంపీడీవో లచ్చాలు తదితరులు పాల్గొన్నారు.



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

పదో తరగతి విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదువుతూ వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. మంగళవారం ముస్తాబాద్ మండలం చీకోడు ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు.

పాఠశాలలోని మధ్యాహ్న భోజన గదిని పరిశీలించి నిర్వాహకురాలికి పలు సూచనలు చేశారు. కంప్యూటర్ గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సోలార్ ఫెన్సింగ్‌ను ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులను గణితంలో పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. అన్ని సబ్జెక్టులను చదవడంతో పాటు రాయడంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. గత సంవత్సరాల ప్రశ్నాపత్రాలను సాధన చేయాలని, పరీక్షల్లో నిర్దిష్ట సమయంలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా ఇప్పటి నుంచే అభ్యాసం చేయాలని తెలిపారు. ఉన్నత తరగతుల్లో ప్రవేశానికి పదో తరగతి మార్కులు ఎంతో కీలకమని పేర్కొన్నారు.

విద్యార్థులు ఎలాంటి నేపథ్యం నుంచి వచ్చినా కష్టపడి చదివి, నిరంతరం సాధన చేస్తే మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, భవిష్యత్తులో వివిధ ఉద్యోగాలు, వృత్తుల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఫారూఖ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు నాలాల కబ్జాలు తొలగించాలి



- ఏఐఎఫ్‌టీయూ న్యూ

-స్పందించకుంటే కలెక్టరేట్ ముట్టడిస్తామని హెచ్చరిక

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణంలోని కొత్తచెరువు నాలాల కబ్జాలను తొలగించి, పూడికతీత పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌టీయూ న్యూ ఆధ్వర్యంలో నాయకులు, బాధితులు మంగళవారం మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా కొత్తచెరువు నాలాలు కబ్జాలకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్వం ఉన్న నాలాల ఆనవాళ్ల ప్రకారం సర్వే నిర్వహించి, కబ్జాలను తొలగించాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 39లో ఉన్న రోడ్డు పునర్నిర్మాణం చేపట్టి శాంతినగర్, శ్రీనగర్ కాలనీవాసుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. నాలాల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, గతంలో ఉన్న విధంగానే పునరుద్ధరించాలని అధికారులను డిమాండ్ చేశారు.

ఈ సమస్యపై గత కొంతకాలంగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ అధికారుల్లో స్పందన లేదని అన్నారు . అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌తో పాటు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ నాయకులు సైతం ప్రజల సమస్యలపై స్పందించడం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో నాలా సమస్యకు తాత్కాలిక పరిష్కారంగా కచ్చా కాలువ తవ్వించారని, అయితే అది శాశ్వత పరిష్కారం కాదని అన్నారు. నాలాల కబ్జాలు, రహదారులకు అడ్డంగా నిర్మాణాలు వంటి సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అధికారులు వెంటనే స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని, నాలాల పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో త్వరలో జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొండా శ్యామ్, ఆకున సత్తయ్య, గుజ్జ దేవదాస్, పంతం సుజాత, తడిగొప్పుల వజ్రవ్వ, గడదాసు లత, సోమిరెడ్డి సుజాతతో పాటు సుమారు వందమంది మహిళలు, బాధితులు పాల్గొన్నారు.

రాజన్న గర్భగుడి శిఖరాన్ని తొలగించాల్సిన అవసరమేంటి..?

-ఆలయ అభివృద్ధి పనులపై పారదర్శకత ఏది..?

-మీడియా, రాజకీయ పార్టీలకు అనుమతివ్వాలి..

-బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి

బలగం టీవీ,వేములవాడ:



రాజన్న ఆలయం ఎవరి వ్యక్తిగత ఆస్తి, జాగీరు కాదని, కోట్లాది మంది హిందువుల ఆరాధ్య దైవమని, దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల పేరుతో ప్రాచీన నిర్మాణాలు, ఆగమ సంప్రదాయాలు, భక్తుల మనోభావాలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆరోపించారు. వేములవాడ పట్టణంలో బీజేపీ వేములవాడ పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ఆలయ అభివృద్ధి పనులకు బీజేపీ సహకరిస్తూ సంయమనం పాటించిందని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయ పవిత్రతకు, ప్రాచీన నిర్మాణాలకు నష్టం కలిగించే చర్యలను సహించబోమని తెలిపారు. గతంలో గర్భగుడిని ముట్టుకోబోమని చెప్పిన అధికారులు ఇప్పుడు గర్భగుడి శిఖరాన్ని తొలగించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. శిఖరాన్ని తొలగించేందుకు ఎవరు అనుమతి ఇచ్చారు, ఆగమ సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకున్నారా, అనే అంశాలపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో చేపట్టిన స్లాబ్ నిర్మాణం కారణంగా గోపుర శిఖరం భక్తులకు కనిపించని పరిస్థితి ఏర్పడిందని, నిర్మాణ పనుల్లో లోపాలు జరిగాయా, కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా,అధికారుల పర్యవేక్షణ లోపమా అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. జరిగిన తప్పిదాలను సరిదిద్దకుండా శృంగేరి పీఠాధిపతుల పేరును ప్రస్తావించడం సమంజసం కాదన్నారు. పీఠం నుంచి ఏ పనులకు అనుమతి తీసుకున్నారు, లిఖితపూర్వక అనుమతులు ఉన్నాయా, వాటిని ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకునేందుకు బీజేపీ నాయకులు స్వయంగా శృంగేరి వెళ్లి పీఠాధిపతులను కలుస్తారని తెలిపారు.

ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎన్ని నిధులు మంజూరు చేసింది,ఇప్పటివరకు ఎంత ఖర్చు చేశారు,ఏయే పనులకు ఎంత కేటాయించారు, కాంట్రాక్టర్ ఎవరు,గర్భగుడి శిఖరం తొలగింపునకు అనుమతి ఇచ్చింది ఎవరు, దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం వంటి ప్రాచీన నిర్మాణాల పరిస్థితి ఏమిటి,అభివృద్ధి పనులు ఎప్పటికి పూర్తవుతాయి, భక్తులకు పూర్తిస్థాయిలో దర్శనం ఎప్పుడు కల్పిస్తారు,అనే ప్రశ్నలకు ప్రభుత్వం, ఆలయ అధికారులు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరారు.ఆలయ అభివృద్ధి పనులపై ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండాలని, ఖర్చుల వివరాలు, అనుమతులు, నిర్మాణాల ప్రస్తుత పరిస్థితిని బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ ఉపాధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ స్పందించి మీడియా ప్రతినిధులతో పాటు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఆలయంలోకి ప్రవేశం కల్పించాలని కోరారు. గర్భగుడి శిఖరం, దక్షిణామూర్తి విగ్రహం, వెయ్యి స్తంభాల మండపం తదితర ప్రాచీన నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించే అవకాశం కల్పించాలన్నారు.

ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించి శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని అన్నారు . ఆలయ పరిరక్షణ కోసం ప్రశ్నించడం నేరమా,భక్తుల మనోభావాలను గౌరవించాలని కోరడం తప్పా,అని ప్రశ్నించారు. మీడియా, రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రవేశ అనుమతి కల్పించే వరకు బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి బీజేపీ వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో ఆలయ ప్రాచీన వైభవం, ఆగమ సంప్రదాయాలు, శిల్పకళా వారసత్వానికి నష్టం కలగకూడదన్నదే తమ అభిమతమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు సిరికొండ శ్రీనివాస్, పొన్నాల తిరుపతిరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు రెగుల సంతోష్ బాబు, కౌన్సిలర్లు పంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ సాబీర్, మండల అధ్యక్షులు కర్ణబత్తుల వేణుగోపాల్, మోకిలే విజయేందర్, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు వంతడుపుల సుధాకర్, మల్లారం తిరుపతి, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సందేవేని రాజు, జక్కుల తిరుపతి తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



శృంగేరి పీఠం సూచనల మేరకే రాజన్న ఆలయ అభివృద్ధి పనులు

- గర్భాలయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా శిఖర నిర్మాణం

-శాస్త్రోక్తంగా ధాన్యాధివాసం నిర్వహించి పనులు ప్రారంభం

- ఆలయ అర్చక బృందం స్పష్టీకరణ

బలగం టీవీ, వేములవాడ:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు శృంగేరి శారదా పీఠాధిపతుల సూచనలు, సలహాలు, ఆశీస్సుల మేరకు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయని ఆలయ అర్చక బృందం స్పష్టం చేసింది. ఆలయ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ఎలాంటి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపింది.

సనాతన కాలం నుంచి వేములవాడ క్షేత్రంలోని ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు శృంగేరి పీఠం మార్గదర్శకత్వంలోనే కొనసాగుతున్నాయని, ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రాచీన ఆలయాల పరిరక్షణ, విస్తరణ పనులపై గతేడాది శ్రావణ మాసంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ కమిషనర్, ప్రభుత్వ ఓఎస్డీ, జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో, అధికారులు, ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు శృంగేరిని సందర్శించి జగద్గురువులతో చర్చించినట్లు తెలిపారు .

స్వామివారి మూలవిరాట్టు కొలువైన ప్రాచీన గర్భాలయానికి ఎలాంటి హాని కలగకుండా శిఖర నిర్మాణం చేపట్టాలని శృంగేరి పీఠం నుంచి శ్రీముఖం ద్వారా సూచనలు అందినట్లు తెలిపారు. గర్భాలయ పైభాగంలో నిర్మించే శిఖరం భక్తులకు దూరం నుంచే స్పష్టంగా కనిపించేలా ఎత్తుగా, పూర్తిగా శిలామయంగా నిర్మించేందుకు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గర్భాలయ పునాదులు, నిర్మాణ పటిష్టతను సాంకేతిక నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి అనుకూలమని నిర్ధారించిన తర్వాతే పనులు ప్రారంభించినట్లు తెలిపారు .ప్రత్యేక శుభ ముహూర్తంలో గర్భాలయంలో శాస్త్రోక్తంగా ధాన్యాధివాసం నిర్వహించి, శిఖర కలశాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. స్వామివారి నిత్య పూజలు, కైంకర్యాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. నిపుణులైన శిల్పులు, నిర్మాణ సిబ్బంది పూజా కార్యక్రమాలకు ఇబ్బంది కలగని సమయాల్లోనే గర్భాలయ పైభాగంలో శిలామయ శిఖర నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు.భగవద్సంకల్పంతో, జగద్గురువుల ఆశీస్సులతో కొనసాగుతున్న ఆలయ అభివృద్ధి పనులపై భక్తులు, ప్రజలు ఎలాంటి అపోహలకు, వదంతులకు తావివ్వకుండా సంయమనంతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



రాజన్న సిరిసిల్లకు సురక్షిత్ గుర్తింపు

-హెచ్ఐవీ నియంత్రణలో 95-95-95 లక్ష్యాల సాధన..

బలగం టీవీ రాజన్న సిరిసిల్ల:

హెచ్ఐవీ నియంత్రణలో జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ (నాకో) నిర్దేశించిన 95-95-95 లక్ష్యాల సాధనలో మెరుగైన ప్రగతి కనబరిచి రాజన్న సిరిసిల్ల జిల్లా 'సురక్షిత్' హోదాను సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ గుర్తింపు పొందిన 20 జిల్లాల్లో రాజన్న సిరిసిల్ల కూడా చోటు సంపాదించింది.ఈ నేపథ్యంలో నాకో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం మంగళవారం జిల్లాను సందర్శించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ సిబ్బందిని మర్యాదపూర్వకంగా కలిశారు.

95-95-95 లక్ష్యాల సాధనలో ప్రగతి

హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో 95 శాతం మందికి వ్యాధి నిర్ధారణ చేయడం, గుర్తించిన వారిలో 95 శాతం మందికి యాంటీ రెట్రోవైరల్ చికిత్స అందించడం, చికిత్స పొందుతున్న వారిలో 95 శాతం మందిలో వైరస్ ప్రభావాన్ని నియంత్రించడం ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యాలు. జిల్లాలో హెచ్ఐవీ పరీక్షలు, బాధితుల గుర్తింపు, చికిత్సకు అనుసంధానం, నిరంతర పర్యవేక్షణ, వైరల్ లోడ్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా ఈ గుర్తింపు లభించిందని అధికారులు తెలిపారు.

నాకో ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమ్మన్ సమారోహ్' కార్యక్రమంలో జిల్లాలను సురక్షిత్, సక్షమ్, సంఘర్ష్‌శీల్ కేటగిరీలుగా విభజించారు. రాష్ట్రంలో 20 జిల్లాలు సురక్షిత్, 12 జిల్లాలు సక్షమ్, ఒక జిల్లా సంఘర్ష్‌శీల్ స్థాయిలో ఉన్నట్లు .తెలిపారు ఈ సందర్భంగా జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణ కార్యక్రమాల అమలు, సాధించిన ప్రగతిపై కలెక్టర్‌తో రాష్ట్ర అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ చర్చించారు. సాధించిన గుర్తింపును కొనసాగిస్తూ నివారణ, పరీక్షలు, చికిత్స, తదుపరి పర్యవేక్షణ సేవలను మరింత పటిష్టం చేయాలని సూచించారు. జిల్లా యంత్రాంగం, వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయ కృషిని అభినందించారు.

నాకో తాజా జాతీయ స్కోర్‌కార్డులో తెలంగాణ రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో నిలిచినట్లు సమ్మన్ సమారోహ్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్, ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రాంరెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

-ర్యాగింగ్, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- ఎస్పీ మహేష్ బి. గితే

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల



డిజిటల్ యుగంలో విద్యార్థులు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వేదికలపై పరిచయమయ్యే అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు.

మంగళవారం జిల్లా పరిధిలోని వైద్య కళాశాలలో ర్యాగింగ్, మత్తు పదార్థాల పై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సుకి ఎస్పీ మహేష్ బి. గితే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో గంజాయి, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ

సోషల్ మీడియాలో కనిపించే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మవద్దని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే స్నేహ అభ్యర్థనలు, సందేశాలు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నకిలీ ఉద్యోగ ప్రకటనలు, బహుమతుల ఆశలు, నకిలీ ఖాతాలు, ఆన్‌లైన్ ఆటలు, డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.మొబైల్ ఫోన్‌ను చెడు వ్యసనాలకు కాకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. కళాశాలల్లో సీనియర్లు, జూనియర్లు అనే తేడా లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో విద్యను అభ్యసించాలని, ర్యాగింగ్, గంజాయి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ వైద్యులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.

ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగం విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. తెలంగాణను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చే లక్ష్యంలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.వైద్య విద్యార్థులు తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కష్టపడి చదివి ఉత్తమ వైద్యులుగా ఎదగాలని, కళాశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రవర్తనపై కళాశాల యాజమాన్యం నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, బాధితులు వెంటనే కళాశాలలోని యాంటీ ర్యాగింగ్ కమిటీకి ఫిర్యాదు చేయాలని తెలిపారు.రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని అన్నారు . విద్యార్థినుల భద్రత కోసం జిల్లా షీ టీం నిరంతరం పనిచేస్తోందని, ఎలాంటి వేధింపులు ఎదురైనా 87126 56425 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.అనంతరం వైద్య విద్యార్థులు గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ ప్రదర్శించిన నాటిక ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, అధ్యాపకులు, సైబర్ ఆర్ఎస్ఐ జునైద్, సైబర్ సిబ్బంది గంగారెడ్డి, మహేష్, కిట్టు, అభిషేక్, విజయ్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



వరికి స్వస్తి.. కూరగాయల సాగుతో సిరుల పంట..

-మూడు ఎకరాల్లో ఆరు రకాల పంటలు.. ఏటా రూ.3 నుంచి 4 లక్షల ఆదాయం

-బందనకల్ రైతు సాగు విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,ముస్తాబాద్:

సంప్రదాయ వరి సాగుకు స్వస్తి పలికి విభిన్న రకాల కూరగాయలు సాగు చేస్తూ మెరుగైన ఆదాయం పొందుతున్నారు ముస్తాబాద్ మండలం బందనకల్ గ్రామానికి చెందిన రైతు చింతలకుల చంద్రం. నీటి వృథాను అరికడుతూ బిందుసేద్యం పద్ధతిలో మూడు ఎకరాల్లో ఆరు రకాల పంటలు సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

చంద్రం తన పొలంలో నీటి నిల్వ కోసం కుంటను ఏర్పాటు చేసుకుని బిందుసేద్యం విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. దీని ద్వారా దోసకాయ, కాకరకాయ, బీరకాయ, టమాట, పచ్చిమిర్చి, వేరుశనగ పంటలను సాగు చేస్తున్నారు. ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంటలను సాగు చేస్తున్నారు. వివిధ రకాల పంటల సాగుతో ఏడాది పొడవునా ఆదాయం పొందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

ఏటా రూ.4 లక్షల వరకు ఆదాయం

బందనకల్ గ్రామంలో రైతు చంద్రం సాగు చేస్తున్న పంటలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాగు విధానం, పంటల విస్తీర్ణం, దిగుబడి, మార్కెటింగ్, ఆదాయ వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. మూడు ఎకరాల్లో కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తూ ఏడాదికి రూ.3 నుంచి 4 లక్షల వరకు ఆదాయం పొందుతున్నట్లు రైతు కలెక్టర్‌కు వివరించారు. ముస్తాబాద్, సిరిసిల్ల పట్టణాల్లో పంట ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ విభిన్న పంటలు సాగు చేస్తున్న రైతు చంద్రంను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, వ్యవసాయ శాఖ అధికారి ప్రదీప్, తహసీల్దార్ ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ నీటితో ఎగువ మానేరు నింపండి..

- అర టీఎంసీ నీటిని విడుదల చేస్తే 17 వేల ఎకరాలకు సాగునీరు..

- డిసెంబర్ 25లోగా స్పష్టమైన ప్రకటన చేయాలి

- స్పందించకుంటే రైతులతో కలిసి నిరాహార దీక్ష చేపడతాం..

బలగం టీవీ, గంభీరావుపేట

యాసంగి సాగుకు నీరందించేందుకు ఎగువ మానేరు కి,మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి అర టీఎంసీ నీటిని విడుదల చేస్తే సుమారు 17 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, వెంటనే మల్లన్నసాగర్ నుంచి నీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు..ఈ మేరకు మంగళవారం ఆయకట్టు రైతులతో కలిసి నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టుతో పాటు సిద్దిపేట జిల్లాలోని మల్లన్నసాగర్ ప్రాజెక్టును నర్మాల మాజీ సర్పంచ్ ఏడబోయిన రాజు, రాజుపేట మాజీ సర్పంచ్ అల్లే సత్యం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆకునూరి రాజేందర్ తదితర నాయకులు సందర్శించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో రైతులకు సాగునీరు అందించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఎగువ మానేరు జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.75 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని తెలిపారు. మల్లన్నసాగర్ నుంచి అర టీఎంసీ నీటిని గ్రావిటీ కాలువ ద్వారా వాగులోకి, అక్కడి నుంచి ఎగువ మానేరులోకి విడుదల చేస్తే కుడి, ఎడమ కాలువల ద్వారా గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల పరిధిలోని సుమారు 17 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని అన్నారు .

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రాజెక్టుల్లో నీటి వినియోగంపై సాగునీటి కమిటీని ఏర్పాటు చేశారని,ఈ నేపథ్యంలో నీటిపారుదల శాఖ అధికారులు, సిరిసిల్ల జిల్లా ఈఈ స్పందించి సమస్యను ఇంజినీర్ ఇన్ చీఫ్ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. మూడు మండలాల రైతుల సాగునీటి అవసరాలను మంత్రికి వివరించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 25వ తేదీలోగా సాగునీటి విడుదలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, లేనిపక్షంలో మూడు మండలాల ఆయకట్టు రైతులతో కలిసి నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పంపరి మహేష్, గుండెల్లి కళ్యాణ్ కుమార్, రైతులు దాసరి చంద్రం తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ సహకారంతో సిరిసిల్ల అభివృద్ధికి ఎంపీ నిధుల కేటాయింపు



- 5, 17వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

సిరిసిల్ల పట్టణంలోని అన్ని వార్డుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని,పట్టణ అభివృద్ధిలో భాగంగా రాజ్యసభ సభ్యుడు డి. దామోదర్ తన ఎంపీ నిధుల నుంచి సుమారు రూ.2 కోట్లు కేటాయించారని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అన్నారు.

మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని 5, 17వ వార్డుల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సహకారంతో ఎంపీ నిధుల ద్వారా పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు సమకూరుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా 17వ వార్డులో రూ.5 లక్షల ఎంపీ నిధులతో పాటు మరో రూ.3 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్ కలిపి మొత్తం రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని అన్నారు . అలాగే 5వ వార్డులో రూ.3 లక్షల మున్సిపల్ జనరల్ ఫండ్‌తో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

ప్రజల కనీస అవసరాల్లో నాణ్యమైన రహదారులు కూడా ముఖ్యమైనవని, ఈ పనులకు నిధులు మంజూరు చేయడంలో సహకరించిన ఎమ్మెల్యే కేటీఆర్‌కు, ఎంపీ నిధులు కేటాయించిన రాజ్యసభ సభ్యుడు డి. దామోదర్‌కు ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాదీర్ పాషా, వైస్ చైర్మన్ దార్ల సందీప్, కౌన్సిలర్లు గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్, దార్నం అరుణ లక్ష్మీనారాయణ, వేముల రాములు, దూదం రజిని శ్రీనివాస్, దొంతునేని కళ్యాణి అశోక్ రావు, మొగిలి నాగరాజు, బుర్ర నారాయణ గౌడ్, గుడ్ల శ్రీనివాస్, మెరుగు మంజుల శ్రీనివాస్, బొద్దుల శ్రీనివాస్, ఎలుక వెంకటేశం, నెల్లుట్ల నరేష్, అడిచెర్ల రూప సాయికృష్ణ, గెంట్యాల శ్యామల శ్రీనివాస్, కూరపాటి శ్రీశైలం, కొండ వర్ధని నరేష్, బత్తుల రమేష్, రిక్కమల్లె రజిత సంపత్, మున్సిపల్ డీఈ వాణి, ఇతర అధికారులు, వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

దేశ ప్రజాస్వామ్య వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలి..

-రాహుల్ గాంధీ, జియాకోమో ఫిలిబెక్‌పై కేసులు నమోదు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్–2026 వేదికగా భారత ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలపై విదేశీ ప్రతినిధులతో రాజకీయ వ్యాఖ్యలు చేసిన, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ (పీఈఎస్) సెక్రటరీ జనరల్ జియాకోమో ఫిలిబెక్‌తో పాటు బాధ్యులపై విచారణ జరిపి, చట్టం ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు.

ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం జిల్లా పోలీస్ ఆఫీస్లో ఎస్పీ మహేష్ బి. గితేకు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ

భారత్ సమ్మిట్‌లో జియాకోమో ఫిలిబెక్ 'ఓట్ చోర్.. గద్దీ ఛోడ్' అంటూ నినాదాలు చేయడం దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ ప్రతినిధుల జోక్యంగా భావిస్తున్నామని అన్నారు.జియాకోమో ఫిలిబెక్ భారత పర్యటన సందర్భంగా వీసా, ఇమ్మిగ్రేషన్ నిబంధనలు ఉల్లంఘించారా అనే అంశంపై విచారణ జరపాలని, సమ్మిట్ నిర్వాహకుల పాత్రను కూడా పరిశీలించాలని కోరారు.దేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దేశ అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ ప్రతినిధులు జోక్యం చేసుకునేలా వేదిక కల్పించడం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేష్, లింగంపల్లి శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజాసింగ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కిరణ్ నాయక్, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు షేక్ సాబీర్, ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వంతడుపుల సుధాకర్, గజ బింకర్ చందు, ఐటీ సెల్ కన్వీనర్ ప్రకాష్, యువ మోర్చా నాయకుడు జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీకి మాజీ జెడ్పీటీసీ దంపతుల రాజీనామా

పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి సైతం గుడ్‌బై

బలగం టీవీ,తంగళ్లపల్లి:

రాజన్న సిరిసిల్ల జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ జెడ్పీటీసీ దంపతులు పూర్మాని మంజుల, రామ్ లింగారెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తమ రాజీనామా లేఖలను సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డికి పంపించారు.గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నామని, అయితే ప్రస్తుత అనివార్య, వ్యక్తిగత కారణాల వల్ల పార్టీని వీడాలని నిర్ణయించుకున్నట్లు రాజీనామా లేఖలో పేర్కొన్నారు. ఇంతకాలం పార్టీలో తమకు సహకరించి, అండగా నిలిచిన పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాలి



-కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల,

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని నిర్దేశిత లక్ష్యం మేరకు పెంచడంతో పాటు, కూరగాయల సాగును విస్తృతం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులతో ఆయిల్ పామ్, కూరగాయల సాగు విస్తీర్ణంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు పురోగతిని వివరించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 697 ఎకరాల్లో కొత్తగా మొక్కలు నాటించగా, ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 3,182 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందన్నారు. ఇందులో 1,076 ఎకరాల్లో పంట కోత ప్రారంభమైందని, ఇప్పటివరకు 1,743 టన్నుల దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతుల ఖాతాల్లో రూ.3.78 కోట్ల ఆదాయం జమ అయినట్లు వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ డీడీలు చెల్లించిన రైతుల భూముల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు సాగులో అవసరమైన సాంకేతిక సహాయం అందించడంతో పాటు, ప్రభుత్వ సబ్సిడీలపై అవగాహన కల్పించాల్సిన్నారు. ఫినోలెక్స్, నేటాఫిమ్, జైన్, కొటారి వంటి బిందు, తుంపర సేద్య పరికరాల సంస్థలు రైతులకు పరికరాలను త్వరితగతిన సరఫరా చేయాలని ఆదేశించారు.జిల్లాలో కూరగాయల సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.సమావేశంలో వ్యవసాయ సహాయ అధికారి ప్రదీప్, ఉద్యానవన శాఖ అధికారులు, ఆయిల్ పామ్, బిందు సేద్య పరికరాల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీబీ జీ రామ్ జీ పనులు
ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి..



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల:

వీబీ జీ రామ్ జీలో భాగంగా నీటి సంరక్షణ పనులను ప్రణాళిక ప్రకారం పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వీబీ జీ రామ్ జీ, జల్ సంచాయ్ జన్ భగీదరి, తెలంగాణ జలసిరి పనులపై జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా పంచాయతీ అధికారి, అటవీ శాఖ, మున్సిపల్ శాఖ, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు గుంతలు, మ్యాజిక్ డ్రైన్లు, పైకప్పు వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు, ఫామ్ పాండ్ లు, పెర్కొలేషన్ ట్యాంకులు, మినీ పెర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యామ్‌లు, దశలవారీ కందకాలు, నిరంతర కాంటూర్ కందకాల నిర్మాణ పనులు చేయనున్నామని, జే ఎస్ ఏ సీ టీ ఆర్, జే ఎస్ జే బీ 1.0, జే ఎస్ జే బీ 2.0 కింద గతంలో చేపట్టిన పనుల మరమ్మతులు, నిర్వహణ పనులు - 34,802, వ్యక్తిగత ఇంకుడు గుంతలు - 8,676, సామూహిక ఇంకుడు గుంతలు - 577, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు - 221, ఫామ్ పాండ్ లు -1,056, పెర్కొలేషన్ ట్యాంకులు - 240 లక్ష్యంగా నిర్ణయించామని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ వివరించారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన లక్ష్యాన్ని అనుగుణంగా పనులను చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి వీర భద్రయ్య, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మిషన్ భగీరథ ఈఈ సుమలత, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధనకు మరో ఉద్యమం తప్పదు



-బీసీలంతా ఐక్యంగా ఉద్యమంలో భాగస్వాములు కావాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్మ హన్మాండ్లు పిలుపు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

నక్సలైట్, తెలంగాణ వంటి ఉద్యమాలు విజయవంతంగా ముగిశాయని, ఇక మిగిలింది బీసీ ఉద్యమమేనని, బీసీ హక్కుల సాధన కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములై ఐక్యంగా పోరాడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్మ హన్మాండ్లు పిలుపునిచ్చారు

మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా ముఖ్య నాయకుల అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షుడు తడుక కమలాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్మ హన్మాండ్లు మాట్లాడుతూ జనాభా తక్కువగా ఉన్న కొన్ని సామాజిక వర్గాలు బీసీల వాటాను దక్కించుకుంటున్నాయని ఆరోపించారు. అనేక ఉద్యమాల్లో బీసీలు ముందుండి పోరాడి ప్రాణత్యాగాలు చేశారని, ఇక సామాజిక న్యాయం కోసం పోరాడి బీసీలు పాలకులుగా ఎదగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

రాష్ట్ర మంత్రివర్గంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని,కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడం అనవసరమని, బీసీలకు ప్రాతినిధ్యం పెంచేలా మరో ముగ్గురు బీసీలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకు టికెట్లు ఇచ్చేందుకు పోటీపడుతున్నాయని, ఇది బీసీలను అవమానించడమేనని అన్నారు. తమ నిర్ణయాన్ని మార్చుకుని రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక్కో స్థానాన్ని బీసీలకు కేటాయించాలని అన్ని పార్టీలను కోరారు.

కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న మహిళా రిజర్వేషన్లలో బీసీలకు ఉపకోటా కల్పించాలని, బీసీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలని, బీసీ క్రిమీలేయర్ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

అనంతరం పట్టణంలోని 4, 5, 25, 26, 31వ వార్డులకు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కొండం వెంకటేశం, బింగి రమేష్, కోడం కనకయ్య, తోట్ల మల్లేశం యాదవ్, రాపెల్లి సాగర్‌లను పర్మ హన్మాండ్లు నియమించారు.ఈ సమావేశంలో తడుక కమలాకర్, బోయిని శ్రీనివాస్, బచ్చు ప్రసాద్, గాజుల సాగర్, గాలి శ్రీనివాస్, దామోదర్, ఆంజనేయులు, పోశెట్టి, సాగర్, రమేష్, కనకయ్య, వెంకటేశం, మల్లేశం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొండగట్టు అంజనేయ స్వామి నిజరూప దర్శనం, చందనోత్సవానికి గవర్నర్, ఉప ముఖ్యమంత్రికి ఆహ్వానం





-ఆహ్వాన పత్రికలు అందజేసిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు

- ఆరు దశాబ్దాల తర్వాత మూలవిరాట్ నిజరూప దర్శనం లభిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా విశేష ప్రాధాన్యత;

- కొండగట్టుకు తరలివలనున్న లక్షలాది మంది భక్తులు

బలగం టీవీ, కొండగట్టు:

జగిత్యాల జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో సుమారు 60 సంవత్సరాల అనంతరం అత్యంత వైభవంగా నిర్వహించనున్న స్వామివారి నిజరూప దర్శనం, చందనోత్సవ మహోత్సవాలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఘనమైన ఆహ్వానం లభించింది. ఈ చారిత్రాత్మక ఆధ్యాత్మిక వేడుకలకు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాల్సిందిగా కోరుతూ వారికి అధికారికంగా ఆహ్వాన పత్రికలను అందజేశారు.

ప్రముఖులను కలిసిన అధికారుల బృందం:

ఈ మేరకు చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎం. హనుమంతరావు, కొండగట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) ఎస్. అంజనారెడ్డి, పర్యవేక్షకులు సునీల్ కుమార్, వేదపారాయణదారులు, అర్చకులు రాష్ట్ర గవర్నర్, ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఈ మహోత్సవాల విశిష్టతను వివరించారు.

భారీ ఏర్పాట్లతో అరుదైన ఆధ్యాత్మిక ఘట్టం:

ఆరు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత భక్తులకు సాక్షాత్తూ స్వామివారి మూలవిరాట్ నిజరూప దర్శనం కల్పించనుండటంతో ఈ వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా అపారమైన ప్రాధాన్యత సంతరించుకుంది.

ఈ అరుదైన మరియు చారిత్రాత్మక ఆధ్యాత్మిక ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు కొండగట్టుకు తరలివచ్చే అవకాశం ఉంది.

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులు, ప్రభుత్వం అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

ఐపీఎల్‌కు 'తలా' ఎంఎస్ ధోనీ వీడ్కోలు

ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించి, చెన్నై సూపర్ కింగ్స్ (CSK) మెంటార్‌గా సరికొత్త బాధ్యతలు!

- ఐపీఎల్ ఆటగాడిగా తమ సుదీర్ఘ ప్రస్థానానికి తెరదించిన 45 ఏళ్ల దిగ్గజ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ; చెన్నై సూపర్ కింగ్స్ మెంటార్‌గా నియామకం
- వేలానికి ముందు రిటైన్, రిలీజ్ ఆటగాళ్ల జాబితాపై జరిగిన వీడియో కాల్‌లో "రిలీజ్ జాబితాలో నా పేరు కూడా చేర్చండి" అంటూ రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించిన ధోనీ
- ధోనీకి గౌరవసూచకంగా ఆయన ఐకానిక్ నంబర్ 7 జెర్సీకి రిటైర్మెంట్ ప్రకటించే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ వెల్లడి





బలగం టీవీ, న్యూఢిల్లీ:

భారత క్రికెట్ దిగ్గజం, చెన్నై సూపర్ కింగ్స్ (CSK) అభిమానుల ఆరాధ్య దైవం 'తలా' మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్ ఆటగాడిగా తన సుదీర్ఘ ప్రస్థానానికి మంగళవారం వీడ్కోలు పలికారు. గత కొన్ని సీజన్లుగా గాయాల కారణంగా ఇబ్బంది పడుతున్న 45 ఏళ్ల ధోనీ, 2026 ఎడిషన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆటగాడిగా రిటైర్మెంట్ తీసుకుని, ఇకపై చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నట్లు ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది.

"రిలీజ్ జాబితాలో నా పేరు కూడా చేర్చండి":

వచ్చే నెలలో జరగనున్న ఐపీఎల్ వేలానికి ముందు రిటైన్, రిలీజ్ చేసే ఆటగాళ్ల జాబితాపై శనివారం జరిగిన వీడియో కాల్‌లో ధోనీ తన నిర్ణయాన్ని వెల్లడించినట్లు సీఎస్‌కే సహ-యజమాని రూపా గురునాథ్ తెలిపారు.

"వచ్చే సీజన్ వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించిన తర్వాత, సీఈఓ కాశీ విశ్వనాథన్ రిలీజ్ చేసే ఆటగాళ్ల జాబితాను చదువుతున్నారు. ఆ సమయంలో ధోనీ ఎంతో ప్రశాంతంగా.. 'బహుశా ఆ జాబితాలో నా పేరు కూడా చేర్చాలేమో' అని చెప్పారు. ఆ మాట వినగానే ఆశ్చర్యకరంగా వీడియో కాల్ కట్ అయిపోయింది. మళ్లీ కాల్ చేసి.. మీరు ఆడలేరనే విషయాన్ని ఇంటర్నెట్ కూడా తట్టుకోలేకపోయినట్లుంది అని చెప్పాను" అని రూపా గురునాథ్ భావోద్వేగంతో వెల్లడించారు.

జట్టుకు తన 200 శాతం ఇవ్వలేనని భావిస్తే ధోనీ మైదానంలోకి దిగరని ఆమె పేర్కొన్నారు.

నంబర్ 7 జెర్సీకి రిటైర్మెంట్?:

ధోనీ లేకుండా సీఎస్‌కే లేదని, దాదాపు రెండు దశాబ్దాలుగా ఆయన జట్టుతో కలిసి నడిచారని ఫ్రాంచైజీ యజమాని ఎన్. శ్రీనివాసన్ పేర్కొన్నారు. యువ ఆటగాళ్లతో కూడిన జట్టును తీర్చిదిద్దడంలో మెంటార్‌గా ధోనీ అనుభవం ఎంతో కీలకమని తెలిపారు. మరోవైపు, ధోనీకి గౌరవసూచకంగా ఆయన ఐకానిక్ నంబర్ 7 జెర్సీకి రిటైర్మెంట్ ప్రకటించే అంశంపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటామని సీఎస్‌కే సీఈఓ కాశీ విశ్వనాథన్ స్పష్టం చేశారు.

సీఎస్‌కే తరఫున ధోనీ అరుదైన రికార్డులు:

ట్రోఫీలు: కెప్టెన్‌గా సీఎస్‌కేకు 5 ఐపీఎల్ టైటిళ్లు, 2 ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లు అందించారు.

పరుగులు & మ్యాచ్‌లు: సీఎస్‌కే తరఫున అత్యధికంగా 272 మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా, 5,314 పరుగులతో రెండో అత్యధిక స్కోరర్‌గా నిలిచారు. (మధ్యలో సీఎస్‌కేపై నిషేధం ఉన్న రెండు సీజన్లలో రైజింగ్ పుణె సూపర్‌జెయింట్స్‌కు ప్రాతినిధ్యం వహించారు).

సారథ్య మార్పు: 2024లో ధోనీ తన కెప్టెన్సీ భాధ్యతలను రుతురాజ్ గైక్వాడ్‌కు అప్పగించారు. 2020లోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ, ఇప్పుడు ఐపీఎల్ ఆటగాడిగా కూడా తప్పుకుని మెంటార్ పాత్రలో అభిమానులకు చేరువగా ఉండనున్నారు.

న్యూజిలాండ్‌కు భారీ షాక్

- **చేయి ఫ్రాక్చర్‌తో భారత్ టెస్టు సిరీస్‌కు కెప్టెన్ మిచెల్ సాంట్నర్ దూరం!**

బలగం టీవీ, వెల్లింగ్టన్:

భారత్‌తో గురువారం నుంచి ప్రారంభం కానున్న కీలక టెస్టు సిరీస్‌కు ముందు న్యూజిలాండ్ క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ సాంట్నర్ గాయం కారణంగా ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మౌంట్ మాంగనుయ్‌లో భారత్‌తో జరిగిన ఐదో వన్డేలో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో భారత పేసర్ అర్షదీప్ సింగ్ వేసిన బౌన్సర్ సాంట్నర్ కుడి చేయికి బలంగా తగిలింది. అనంతరం నిర్వహించిన స్కానింగ్‌లో చేయికి ఫ్రాక్చర్ (ఎముక విరిగినట్లు) అయినట్లు తేలిందని న్యూజిలాండ్ క్రికెట్ బోర్డు అధికారికంగా ప్రకటించింది.

సాంట్నర్ స్థానంలో డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్‌కు చోటు:

గాయపడిన మిచెల్ సాంట్నర్ స్థానంలో మరో ఆల్‌రౌండర్ డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (Dean Foxcroft)ను కివీస్ సెలెక్టర్లు జట్టులోకి తీసుకున్నారు. ఫాక్స్‌క్రాఫ్ట్ ఇప్పటివరకు ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. గతంలో బెల్‌ఫాస్ట్‌లో ఐర్లాండ్‌తో జరిగిన ఆ టెస్టులో అతడు 98 పరుగులతో ఆకట్టుకున్నాడు.

సాంట్నర్ గైర్హాజరీలో బేసిన్ రిజర్వ్ వేదికగా జరిగే తొలి టెస్టులో గ్లెన్ ఫిలిప్స్ (ప్రధాన స్పిన్ బౌలింగ్ బాధ్యతలు నిర్వర్తించే అవకాశాలు ఉన్నాయి.

డిసెంబర్ 9 నుంచి ఆస్ట్రేలియాతో జరగనున్న నాలుగు టెస్టుల సిరీస్‌కు సాంట్నర్ అందుబాటులో ఉంటాడా లేదా అనే విషయంపై ఆ సమయానికి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నారు.



ఛాంపియన్‌షిప్‌లో భారత్ జయభేరి
పాకిస్తాన్‌ను 2-1తో చిత్తు చేసి రికార్డు స్థాయిలో 10వ టైటిల్ కైవసం!

బలగం టీవీ, ఢాకా:

చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌పై భారత్ 2-1తో ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో రికార్డు స్థాయిలో పదోసారి సాఫ్ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. వరుసగా మూడోసారి చాంపియన్‌గా నిలిచి టైటిల్‌ను నిలబెట్టుకుంది. ద్వితీయ శ్రేణి జట్టుతో బరిలోకి దిగినప్పటికీ ఫైనల్లో సత్తా చాటింది. పాకిస్తాన్ తరఫున అలంగీర్ ఘాజీ (45+1వ నిమిషం) గోల్ చేయగా.. భారత్ తరఫున సుహైల్ అహ్మద్ భట్ (60వ నిమిషం), సందీప్ మాండీ (88వ నిమిషం) గోల్స్ సాధించారు.

తొలి అర్ధభాగంలో పాకిస్తాన్ ఆధిపత్యం ప్రదర్శించింది. తొలి 30 నిమిషాల్లో తొమ్మిది షాట్లు కొట్టగా, భారత్ రెండుసార్లు మాత్రమే ప్రయత్నించింది. 35వ నిమిషంలో భారత ఆటగాళ్లకు గోల్ చేసే అవకాశాలు వచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయారు. ప్రథమార్ధం అదనపు సమయంలో జునైద్ షా ఎడమ వైపు నుంచి అందించిన బంతిని అందుకున్న అలంగీర్ ఘాజీ అద్భుతమైన కుడికాలి షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్ కుడి మూలకు పంపించాడు. దీంతో పాకిస్తాన్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది.

రెండో అర్ధభాగంలో మ్యాచ్ స్వరూపం మారింది. 59వ నిమిషంలో భారత ఆటగాడు బ్రిసన్ ఫెర్నాండెజ్‌పై ప్రమాదకరంగా టాకిల్ చేసిన జునైద్ షాకు VAR సమీక్ష అనంతరం రెడ్‌కార్డు చూపించారు. దీంతో పాకిస్తాన్ పది మంది ఆటగాళ్లకే పరిమితమైంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న భారత్ 60వ నిమిషంలో స్కోరు సమం చేసింది. లుంగ్‌డిమ్ ఖైమింతాంగ్ అందించిన ఫ్రీకిక్‌ను మెకార్టన్ నిక్సన్ స్వల్పంగా టచ్ చేయగా, సుహైల్ భట్ బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపించాడు.

స్కోరు సమం కావడంతో పాకిస్తాన్ జట్టు మార్పులు చేపట్టింది. మరోవైపు భారత కోచ్ నౌషాద్ మూసా కూడా ఆటగాళ్లను మార్చి దాడులను తీవ్రతరం చేశారు. ఇర్ఫాన్ యాద్వాద్ అందించిన క్రాస్‌ను అందుకున్న అబ్దుల్ రబీహ్ గోల్ కోసం ప్రయత్నించినా పాకిస్తాన్ డిఫెన్స్ అడ్డుకుంది. అదనపు సమయం సమీపిస్తున్న తరుణంలో 88వ నిమిషంలో అబ్దుల్ రబీహ్ అందించిన కార్నర్‌ను సందీప్ మాండీ హెడర్‌తో గోల్‌గా మలిచాడు. దీంతో భారత్ 2-1తో విజయం సాధించి పదోసారి సాఫ్ చాంపియన్‌షిప్ టైటిల్‌ను అందుకుంది. తొలి సారి ఫైనల్‌కు చేరిన పాకిస్తాన్‌కు నిరాశ ఎదురైంది.